సంపుటి : 9
సంచిక : 318
సోమవారం
10 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT


CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE






Contact For Ads:
7579339999


## 'మెగా డీఎస్సీ'పై మెగా దుమారం!





### 16,347లో 15,941 పోస్టుల భర్తీ.. ఇంకా 406 ఖాళీ

### నియామకాల పారదర్శకతపై అధికార-ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం

**మెగా డీఎస్సీ - ఒక్క చూపులో**

| | |
|---|---|
| మొత్తం పోస్టులు: | 16,347 |
| భర్తీ అయినవి: | 15,941 |
| మిగిలిన ఖాళీలు: | 406 |
| జిల్లా స్థాయి పోస్టులు: | 14,088 \| ఎంపిక: 13,753 \| ఖాళీలు: 335 |
| రాష్ట్ర-జోనల్ పోస్టులు: | 2,259 \| ఎంపిక: 2,188 \| ఖాళీలు: 71 |
| అత్యధిక ఖాళీలు: | కర్నూలు 88, చిత్తూరు 70, అనంతపురం 56 |
| అత్యల్ప ఖాళీలు: | తూర్పు గోదావరి 4 |

- 13 ఉమ్మడి జిల్లాల పరిధిలో 14,088 పోస్టులు.. 13,753 మంది ఎంపిక
- జిల్లా స్థాయిలో ఇంకా 335 ఖాళీలు.. రాష్ట్ర-జోనల్ కేడర్‌లో మరో 71
- కర్నూలులో అత్యధికంగా 88 ఖాళీలు.. చిత్తూరులో 70.. అనంతపురంలో 56
- తూర్పు గోదావరిలో 1,353 పోస్టులకు 1,349 మంది ఎంపిక.. మిగిలింది నాలుగే



నారా లోకేష్
విద్యాశాఖ మంత్రి

- అవకతవకలు జరిగాయంటూ వైఎస్సార్‌సీపీ ఆరోపణలు.. సీబీఐ విచారణకు డిమాండ్
- 'నిబంధనల ప్రకారమే నియామకాలు' అంటూ ఆరోపణలను ఖండించిన విద్యాశాఖ
- ఎంపికైన ఉపాధ్యాయుల నుంచీ ప్రతిస్పందన.. కర్నూలులో 'ఆత్మగౌరవ ర్యాలీ'

మెగా డీఎస్సీ-2025 నియామకాల్లో 16,347 పోస్టులకు గాను 15,941 పోస్టులు భర్తీ కావడం ద్వారా ప్రక్రియ దాదాపు పూర్తి అయినప్పటికీ, ఇంకా 406 పోస్టులు ఖాళీగా నేలకొన్నాయి. జిల్లాలవారీగా, కేడర్లవారీగా ఖాళీలు, ఎంపికల వివరాలు వెల్లడించగా, పారదర్శకతపై ప్రతిపక్షం ఆరోపణలు చేస్తోంది. అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేస్తోంది. అయితే, అన్ని నియామకాలు నిబంధనల ప్రకారమే నిర్వహించామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇదే వేళ, కర్నూలులో ఎంపికైన ఉపాధ్యాయులు 'ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహించి తమ గళం వినిపించారు.

**ఎవరి వాదన ఏమిటి?**

**వైఎస్సార్‌సీపీ**
- పోస్టుల కేటాయింపులలో అవకతవకలు
- మెరిట్, ఎంపికల విధానంపై ప్రశ్నలు
- సీబీఐ విచారణకు డిమాండ్

**ప్రభుత్వం**
- నియామకాలు నిబంధనల ప్రకారమే
- కంప్యూటర్ ఆధారిత పరీక్షలతో పారదర్శకత
- అవకతవకల ఆరోపణలను ఖండన

**ఎంపికైన ఉపాధ్యాయులు**
- తమ ప్రతిభపై అనుమానాలు పట్ల ఆవేదన
- న్యాయం చేసే నియామకాలకు మద్దతు
- ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహణ




కర్నూలులో ఎంపికైన ఉపాధ్యాయుల 'ఆత్మగౌరవ ర్యాలీ'



మెగా డీఎస్సీపై వైఎస్సార్‌సీపీ నేతల మీడియా సమావేశం

**అమరావతి, ఆగస్టు 9, విశ్వం వాయిస్ ప్రత్యేక ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూసిన మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామకాల వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా, తుది నియామక ప్రక్రియలో 15,941 పోస్టులు భర్తీ అయ్యాయి. మరో 406 పోస్టులు మాత్రం అర్హులైన అభ్యర్థులు అందుబాటులో లేకపోవడం సహా వివిధ కారణాలతో ఖాళీగా మిగిలాయి. ఈ 406 పోస్టులను భవిష్యత్ ఉపాధ్యాయ నియామక ప్రక్రియకు క్యారీ ఫార్వర్డ్ చేయనున్నట్లు విద్యాశాఖ ఇప్పటికే వెల్లడించింది. అయితే నియామక విధానం, మెరిట్ జాబితాలు, రిజర్వేషన్ల అమలు, క్రీడా కోటా తదితర అంశాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రశ్నలు లేవనెత్తుతుండటంతో డీఎస్సీ వ్యవహారం మరోసారి రాజకీయ కేంద్రబిందువుగా మారింది.

**16,347 పోస్టుల్లో లెక్క ఇదీ..**

మెగా డీఎస్సీలో ప్రకటించిన మొత్తం 16,347 పోస్టుల్లో 14,088 పోస్టులు జిల్లా స్థాయి మిగతా .. 2లో..

ఇంటింటికీ టీడీపీ

## 14 రోజుల్లో 40 లక్షల గడపలు

### కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరణ

### క్షేత్రస్థాయిలో పర్యటించాలని మంత్రులకు నారా లోకేష్ ఆదేశం




**అమరావతి, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని, సంక్షేమ ఫలాలను ప్రజలకు నేరుగా వివరించే ఈ కార్యక్రమం ఆదివారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. గడిచిన 14 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు 40.74 లక్షలకు పైగా కుటుంబాలను నేరుగా కలుసుకుని రికార్డు సృష్టించాయి. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనతో ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3.53 లక్షల ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీల అమలు తీరును, ఇతర సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందుతున్న ప్రయోజనాలను ప్రతి కుటుంబానికి వివరిస్తున్నారు. ఈ కార్యక్రమ పురోగతిపై టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించారు. కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ఆయన పార్టీ శ్రేణులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు తమకు మిగతా .. 2లో..

## 'నేనే రాజు.. నేనే మంత్రి' అనే రీతిలో దామచర్ల..

### మాజీ మంత్రి బాలినేని విమర్శలు



**ఒంగోలు, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకాశం జిల్లా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌పై మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి విమర్శలు చేశారు. 'నేనే రాజు.. నేనే మంత్రి' అనే రీతిలో ఆయన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దామచర్ల తీరుతో తెదేపా నేతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒంగోలులో నిర్వహించిన మీడియా సమావేశంలో మిగతా .. 2లో..

మహిళా ఎస్సైపై దాడి కేసులో

## వైసీపీ నేత చింతాడ రవికుమార్ అరెస్ట్

### పశ్చిమ బెంగాల్ కారులో వెళ్తుండగా చిలకపాలెం వద్ద పట్టివేత
### లొంగిపోవడానికి వెళ్తుంటే పట్టుకున్నారన్న రవికుమార్
### పరారీకి సహకరించిన వారిపైనా చర్యలు తప్పవన్న పోలీసులు



**శ్రీకాకుళం, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 30న శ్రీకాకుళంలో బందోబస్తు విధుల్లో ఉన్న మహిళా ఎస్సై ప్రవల్లిక పట్ల అనుచితంగా ప్రవర్తించిన కేసులో ఆయన ప్రధాన నిందితుడు (ఏ1)గా ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదైన నాటి నుంచి ఆయన పరారీలో ఉన్నారు. గత ఎనిమిది రోజులుగా పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న రవికుమార్‌ను శనివారం రాత్రి 8 గంటల సమయంలో చిలకపాలెం కూడలి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పశ్చిమ బెంగాల్ రిజిస్ట్రేషన్ కలిగిన మిగతా .. 2లో..

## చంద్రబాబు అనే నేను స్వర్ణాంధ్ర సంకల్పం చేశా..




- అంతా సంకల్పిస్తేనే దేశం, రాష్ట్రం, గ్రామం అభివృద్ధి
- దేశ నిర్మాణంలో పౌరుల భాగస్వామ్యమే కీలకం
- పనిచేసే ప్రతి వ్యక్తీ సమాజానికి ఓ మంచి ఆస్తి
- 5 అంశాలతో ఆదివాసీల సమగ్రాభివృద్ధికి ప్రణాళిక
- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో సీఎం చంద్రబాబు



**అమరావతి, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశానికి, రాష్ట్రానికి విజన్ ఉన్నట్టే ప్రతీ పౌరుడికి ఓ విజన్ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశం, రాష్ట్రం, గ్రామం, కుటుంబం అభివృద్ధి కోసం అంతా సంకల్పం తీసుకోవాలని ఆయన అన్నారు. 2047 స్వర్ణాంధ్ర కోసం తాను సంకల్పం తీసుకున్నానని ముఖ్యమంత్రి అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. గిరిజన సంప్రదాయ నృత్యం ధింసా, డప్పు, వివిధ వాయిద్యాలతో గిరిజన మహిళలు, మంత్రి సంధ్యారాణి, ఇతర ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ధింసా నృత్యం చేస్తున్న మహిళలతో ఆయన కూడా అడుగులు వేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి ముఖ్యమంత్రి నివాళులు అర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "ప్రకృతిని ఆరాధిస్తూ, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు చేయగల సామర్థ్యం ఆదివాసీలకు ఉంది. ఓ సామాన్య ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్ము ఒడిశాలో మంత్రిగా, గవర్నర్ గా పనిచేసి నేడు రాష్ట్రపతిగా అత్యున్నత స్థానంలో ఉన్నారు. మన సంకల్పమే మనకు ఆత్మవిశ్వాసం కల్పించి అందలాలు ఎక్కిస్తుంది. అబ్దుల్ కలాం, ఎన్టీఆర్, ప్రధాని మోదీ ఇలా ప్రతి ఒక్కరూ సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వారే. సంకల్పం ఒక్కటే మార్పు తెస్తుందని అంతా గుర్తించాలి. దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేలా అంతా సంకల్పం తీసుకోవాలి. నేను, నా దేశం, నా రాష్ట్రం, నా ఊరు నా కుటుంబం అనే భావనతో సంకల్పం చేస్తేనే అభివృద్ధి సాధించగలం. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజానికి, దేశానికి నేను ఏమివ్వాలనే లక్ష్యంతో పనిచేద్దాం. గిరిజన రైతులు తన పంటను మెరుగ్గా పండించి దేశం కోసం కృషి చేశారు. స్వయం ఉపాధితో సంపాదిస్తున్న మహిళ దేశం కోసం పనిచేసినట్టే. ఓ విద్యార్థి, ఓ ఉద్యోగి, ఓ వ్యాపారి, ఓ కూలి ఇలా ఎవరైనా నిష్టతో అత్యుత్తమ సామర్థ్యంతో పని చేస్తే దేశ కోసం పనిచేసినట్టే. సమాజానికి ఏమిచ్చాం, మిగతా .. 2లో..

పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి

## కేసీఆర్ పరామర్శ

### రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం చెక్కులు అందజేత
### సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగం



**వరంగల్, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ ప్రకటించిన రూ.2.25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను కేసీఆర్ స్వయంగా సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. నల్లబెల్లిలోని నివాసానికి చేరుకున్న మిగతా .. 2లో..




తిరుమలలో కొనసాగుతున్న

## భక్తుల భారీ రద్దీ

- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు నిండి బయటకు చేరిన క్యూలైన్లు
- గోగర్భం డ్యామ్ సర్కిల్ వద్ద ఆక్టోపస్ భవనం వరకు బారులు
- సర్వదర్శనానికి 20 నుంచి 24 గంటల నిరీక్షణ
- ఒక్కరోజే రూ.4.13 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం



**తిరుమల, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు బయటకు విస్తరించాయి. గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు మిగతా .. 2లో..

## మత్తు వేగానికి వైద్య కల బలి!

### రాజమండ్ర మెడికో ప్రియాంక ఇక లేరు




**రాజమహేంద్రవరం / హైదరాబాద్, ఆగస్టు 9, విశ్వం వాయిస్ ప్రత్యేక ప్రతినిధి న్యూస్:** ఎన్నో కలలు... ఎంతో కష్టం... వైద్యురాలిగా సమాజానికి సేవ చేయాలన్న లక్ష్యం... వాటన్నింటినీ ఒక్క రాత్రి జరిగిన ఘటన ఛిద్రం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన రాజమహేంద్రవరం మెడికో డాక్టర్ కానికె ప్రియాంక (28) ఘటన విషాదాంతమైంది. ఆగస్టు 3న రాజమహేంద్రవరంలోని మల్టీప్లెక్స్ సమీపంలో మద్యం సేవించినట్లు పోలీసులు చెబుతున్న మిగతా .. 2లో..

# 'మెగా డీఎస్సీ'పై మెగా దుమారం!

(మొదటిపేజీ తరువాయి)

నియామకాలకు సంబంధించినవి కాగా, మరో 2,259 పోస్టులు రాష్ట్ర, జోనల్ స్థాయి కేడర్లకు సంబంధించినవి. జిల్లా స్థాయిలో ఉన్న 14,088 పోస్టులకు 13,753 మంది ఎంపికయ్యారు. 335 పోస్టులు ఖాళీగా మిగిలాయి. రాష్ట్ర, జోనల్ స్థాయిలోని 2,259 పోస్టుల్లో 2,188 పోస్టులు భర్తీ కాగా, 71 పోస్టులు మిగిలాయి.

**ఈ రెండింటినీ కలిపితే మొత్తం:**

నోటిఫై చేసిన పోస్టులు - 16,347

భర్తీ అయిన పోస్టులు - 15,941భర్తీ కాని పోస్టులు - 406

అంటే నోటిఫై చేసిన మొత్తం పోస్టుల్లో దాదాపు 97.5 శాతం పోస్టులు భర్తీ అయ్యాయి.

**జిల్లాల లెక్కల్లో కర్నూలులో అత్యధిక ఖాళీలు**

మెగా డీఎస్సీ జిల్లా స్థాయి నియామకాల గణాంకాలను పరిశీలిస్తే కర్నూలు ఉమ్మడి జిల్లా పరిధిలో అత్యధిక పోస్టులు ఉండటంతో పాటు ఖాళీగా మిగిలిన పోస్టుల సంఖ్య కూడా అక్కడే ఎక్కువగా నమోదైంది.

కర్నూలులో 2,678 పోస్టులకు 2,590 మంది ఎంపిక కాగా 88 పోస్టులు ఖాళీగా మిగిలాయి.

చిత్తూరులో 1,478 పోస్టులకు 1,408 మంది ఎంపిక కాగా 70 పోస్టులు, అనంతపురంలో 811 పోస్టులకు 755 మంది ఎంపిక కాగా 56 పోస్టులు, వైఎస్సార్ కడపలో 712 పోస్టులకు 680 మంది ఎంపిక కాగా 32 పోస్టులు మిగిలాయి.

గుంటూరులో 19, నెల్లూరులో 16, పశ్చిమ గోదావరిలో 11, ప్రకాశంలో 11, కృష్ణాలో 10, శ్రీకాకుళంలో 8, విజయనగరంలో 5, విశాఖపట్నంలో 5 పోస్టులు భర్తీ కాకుండా మిగిలినట్లు తుది గణాంకాలు సూచిస్తున్నాయి.

**తూర్పు గోదావరిలో దాదాపు సంపూర్ణ భర్తీ**

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో మెగా డీఎస్సీ నియామకాల భర్తీ శాతం అత్యధికంగా నమోదైంది. జిల్లా పరిధిలో మొత్తం 1,353 పోస్టులు నోటిఫై చేయగా 1,349 మంది ఎంపికయ్యారు. కేవలం నాలుగు పోస్టులు మాత్రమే ఖాళీగా మిగిలాయి. అంటే తూర్పు గోదావరిలో దాదాపు 99.7 శాతం పోస్టులు భర్తీ అయ్యాయి. అదేవిధంగా విశాఖపట్నంలో 1,139 పోస్టులకు 1,134 మంది, కృష్ణాలో 1,213 పోస్టులకు 1,203 మంది, పశ్చిమ గోదావరిలో 1,074 పోస్టులకు 1,063 మంది ఎంపికయ్యారు.

**జిల్లాలవారీగా మెగా డీఎస్సీ లెక్క**

శ్రీకాకుళం: నోటిఫై చేసినవి - 543, ఎంపికైన వారు - 535, ఖాళీలు - 8

విజయనగరం: నోటిఫై చేసినవి - 583, ఎంపికైన వారు - 578, ఖాళీలు - 5

విశాఖపట్నం: నోటిఫై చేసినవి - 1,139, ఎంపికైన వారు - 1,134, ఖాళీలు - 5

తూర్పు గోదావరి: నోటిఫై చేసినవి - 1,353, ఎంపికైన వారు - 1,349, ఖాళీలు - 4

పశ్చిమ గోదావరి: నోటిఫై చేసినవి - 1,074, ఎంపికైన వారు - 1,063, ఖాళీలు - 11

కృష్ణా: నోటిఫై చేసినవి - 1,213, ఎంపికైన వారు - 1,203, ఖాళీలు - 10

గుంటూరు: నోటిఫై చేసినవి - 1,159, ఎంపికైన వారు - 1,140, ఖాళీలు - 19

ప్రకాశం: నోటిఫై చేసినవి - 672, ఎంపికైన వారు - 661, ఖాళీలు - 11

నెల్లూరు: నోటిఫై చేసినవి - 673, ఎంపికైన వారు - 657, ఖాళీలు - 16

చిత్తూరు: నోటిఫై చేసినవి - 1,478, ఎంపికైన వారు - 1,408, ఖాళీలు - 70

వైఎస్సార్ కడప: నోటిఫై చేసినవి - 712, ఎంపికైన వారు - 680, ఖాళీలు - 32

అనంతపురం: నోటిఫై చేసినవి - 811, ఎంపికైన వారు - 755, ఖాళీలు - 56

కర్నూలు: నోటిఫై చేసినవి - 2,678, ఎంపికైన వారు - 2,590, ఖాళీలు - 88

**13 ఉమ్మడి జిల్లాలు మొత్తం**

పోస్టులు - 14,088, ఎంపిక - 13,753, ఖాళీలు - 335

రాష్ట్ర-జోనల్ స్థాయిలో మరో 71 పోస్టులు ఖాళీ

జిల్లా స్థాయి పోస్టులతో పాటు రాష్ట్ర, జోనల్ స్థాయిలో మొత్తం 2,259 పోస్టులను మెగా డీఎస్సీలో నోటిఫై చేశారు.

రాష్ట్ర స్థాయిలో 259 పోస్టుల్లో 243 భర్తీ కాగా 16 మిగిలాయి.

జోన్-1లో 395 పోస్టులకు 390 మంది ఎంపిక కాగా ఐదు పోస్టులు, జోన్-2లో 347 పోస్టులకు 330 మంది ఎంపిక కాగా 17 పోస్టులు, జోన్-3లో 572 పోస్టులకు 558 మంది ఎంపిక కాగా 14 పోస్టులు, జోన్-4లో 686 పోస్టులకు 667 మంది ఎంపిక కాగా 19 పోస్టులు మిగిలాయి.

దీంతో రాష్ట్ర-జోనల్ స్థాయిలో మొత్తం 2,259 పోస్టులకు 2,188 మంది ఎంపిక కాగా, 71 పోస్టులు భర్తీ కాలేదు.

**406 పోస్టులు ఎందుకు మిగిలాయి?**

తుది ఎంపిక తర్వాత కూడా 406 పోస్టులు ఎందుకు భర్తీ కాలేదన్న ప్రశ్నకు విద్యాశాఖ వర్గాలు వివరణ ఇచ్చాయి. ఆయా రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ కేటగిరీలు, అర్హత ప్రమాణాలకు తగిన అభ్యర్థులు అందుబాటులో లేకపోవడం, కొన్ని సందర్భాల్లో అర్హులైన అభ్యర్థులు చేరకపోవడం వంటి కారణాలతో పోస్టులు ఖాళీగా మిగిలినట్లు తెలిపాయి. మెగా డీఎస్సీ నియామక నిబంధనల ప్రకారం తుది ఎంపిక జాబితా వెలువడిన తర్వాత ప్రత్యేక వెయిటింగ్ లిస్టు ఉండదు. అర్హులైన అభ్యర్థులు అందుబాటులో లేక పోస్టు భర్తీ కాకపోతే ఆ ఖాళీని భవిష్యత్ నియామకానికి మళ్లించే అవకాశం ఉంటుంది.

**వైఎస్సార్‌సీపీ ఆరోపణలేంటి?**

ఇదే సమయంలో మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. మెరిట్ జాబితాల ప్రకటన, కటాఫ్ మార్కులు, ఎంపిక విధానం, క్రీడా కోటా, రిజర్వేషన్ల అమలు తదితర అంశాల్లో మరింత పారదర్శకత అవసరమని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. పరీక్షలు, ప్రశ్నపత్రాల నిర్వహణ, ఎంపిక ప్రక్రియకు సంబంధించి తమకు అనుమానాలు ఉన్నాయని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపిస్తూ, మొత్తం వ్యవహారంపై స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెగా డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అయితే ఇవి ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలేనని, ఇప్పటివరకు నిర్ధారిత అక్రమాలుగా తేలలేదన్న విషయాన్ని గమనించాల్సి ఉంది.

**'అవకతవకలు లేవు.. పూర్తి పారదర్శకతతోనే'**

వైఎస్సార్‌సీపీ చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఖండిస్తున్నారు. మెగా డీఎస్సీని కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించామని, ప్రశ్నపత్రాల తయారీ నుంచి పరీక్ష కేంద్రాల నిర్వహణ, టెట్-డీఎస్సీ మార్కుల వెయిటేజీ, సాధారణీకరణ, ధ్రువపత్రాల పరిశీలన, రోస్టర్ అమలు వరకు అన్ని దశల్లోనూ నిర్దేశిత నిబంధనలు పాటించామని విద్యాశాఖ చెబుతోంది. 20 శాతం టెట్ మార్కులు, 80 శాతం డీఎస్సీ మార్కులను పరిగణనలోకి తీసుకుని తుది మెరిట్ రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. హారిజాంటల్ రిజర్వేషన్ల అమలుపై సరైన అవగాహన లేకపోవడం వల్ల కొన్ని సందేహాలు, ఆరోపణలు వస్తున్నాయని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. నియామకాల్లో ఎలాంటి తారుమారు జరగలేదని, ప్రక్రియను పారదర్శకంగానే పూర్తి చేశామని విద్యాశాఖ కార్యదర్శి స్పష్టం చేశారు. 3.36 లక్షల మంది అభ్యర్థులు.. 5.77 లక్షల దరఖాస్తులు మెగా డీఎస్సీకి రాష్ట్రవ్యాప్తంగా భారీ స్పందన లభించింది. సుమారు 3.36 లక్షల మంది అభ్యర్థుల నుంచి 5.77 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో అభ్యర్థి అర్హత మేరకు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండటంతో దరఖాస్తుల సంఖ్య అభ్యర్థుల సంఖ్య కంటే ఎక్కువగా నమోదైంది. జూన్ 6 నుంచి జూలై 2, 2025 వరకు వివిధ విడతల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఫలితాలు, ధ్రువపత్రాల పరిశీలన, రిజర్వేషన్--రోస్టర్ అమలు తదితర ప్రక్రియలను పూర్తి చేసి 15,941 పోస్టులకు తుది ఎంపిక చేశారు.

**ఉపాధ్యాయుల నుంచీ ప్రతిస్పందన**

డీఎస్సీ వివాదం రాజకీయ పార్టీలకే పరిమితం కాకుండా ఉద్యోగాలకు ఎంపికైన ఉపాధ్యాయుల వరకూ చేరింది. తమ నియామకాలపై జరుగుతున్న ఆరోపణలు తమ ప్రతిభను, ఆత్మగౌరవాన్ని ప్రశ్నించేలా ఉన్నాయని పేర్కొంటూ ఆగస్టు 8న కర్నూలులో మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు 'ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహించారు. నిబంధనల ప్రకారం పరీక్షలు రాసి, ప్రతిభ, రిజర్వేషన్, రోస్టర్ విధానాల ఆధారంగా ఉద్యోగాలు పొందామని, తమ నియామకాలన్నింటినీ అనుమానాస్పదంగా చిత్రీకరించడం సరికాదని పలువురు ఎంపికైన ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

**రాజకీయంగా మరింత వేడెక్కుతున్న డీఎస్సీ**

ఒకవైపు నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సీబీఐ విచారణ కోరుతున్న వైఎస్సార్‌సీపీ.. మరోవైపు ప్రతి ఎంపిక నిబంధనల ప్రకారమే జరిగిందని స్పష్టం చేస్తున్న ప్రభుత్వం.. మధ్యలో తమ ప్రతిభను ప్రశ్నించవద్దంటున్న ఎంపికైన ఉపాధ్యాయులు ఈ మూడు వాదనలతో మెగా డీఎస్సీ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరింత వేడెక్కుతోంది. అయితే గణాంకాల పరంగా చూస్తే మొత్తం 16,347 పోస్టుల్లో 15,941 పోస్టులు భర్తీ కాగా 406 పోస్టులు ఇంకా ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు రాజకీయ ఆరోపణలకు అతీతంగా ప్రభుత్వం ముందున్న అసలు ప్రశ్న-మిగిలిన 406 పోస్టులను ఎప్పుడు, ఏ విధంగా భర్తీ చేస్తారు? అర్హులైన అభ్యర్థులు అందుబాటులో లేని కేటగిరీలకు సంబంధించిన ఈ పోస్టులను తదుపరి డీఎస్సీలో కలుపుతారా? కొత్త నోటిఫికేషన్‌లో వాటిని స్పష్టంగా చూపిస్తారా? జిల్లాలు, కేటగిరీలు, రోస్టర్ పాయింట్లవారీగా ఖాళీల పూర్తి వివరాలను ప్రజల ముందుంచుతారా? అన్న అంశాలపై నిరుద్యోగుల్లో ఆసక్తి నెలకొంది.

# చంద్రబాబు అనే నేను స్వర్ణాంధ్ర సంకల్పం చేశా..

(మొదటిపేజీ తరువాయి)

దేశానికి ఏం చేశాం అన్నదే లక్ష్యంగా పనిచేయాలి. ఒకరు ప్రకృతి కోసం, మరొకరు పర్యావరణం కోసం, ఇంకోకరు నీటి సంరక్షణ కోసం పనిచేయాలి. రాష్ట్రానికి, దేశానికి విజన్ ఉన్నట్టే వ్యక్తిగతం గానూ ప్రతి ఒక్కరికీ ఓ విజన్ ఉండాలి. వికసిత్ భారత్ విజన్ ను ప్రధాని మోదీ చేస్తే, నేను 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపకల్పన చేశాను. జాతీయ జెండా స్ఫూర్తితో కలసికట్టుగా ముందుకు అడుగేద్దాం. వ్యక్తిగతంగా విజయం సాధించటమూ నేషన్ బిల్డింగ్ లో భాగమే. పనిచేసే ప్రతీ వ్యక్తీ సమాజానికి ఆస్తి. సమాజం కోసం పనిచేయటమే గొప్ప దేశభక్తి, అందరి గెలుపే దేశం గెలుపు." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**అరకు కాఫీని గ్లోబల్ బ్రాండ్‌గా మారుస్తాం**

"భోగాపురంలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం. విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గిరిజన బిడ్డలు థింసా నృత్యం ఇప్పుడు గిన్నీస్ బుక్ రికార్డు సాధించింది. ఈ రికార్డు సాధించి మన సంస్కృతీ సంప్రదాయాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. పోడు వ్యవసాయం కాదు ఆర్గానిక్ వ్యవసాయంతో గిరిజనులు విలువైన పంటల్ని ఉత్పత్తి చేస్తున్నారు. రాష్ట్రంలోని 27.39 లక్షల మంది గిరిజనుల సమగ్రాభివృద్ధికి రూ.4764 కోట్లను కేటాయించాం. ఐటీడీఏలతో గిరిజన అభివృద్ధి కోసం జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రత్యేకంగా దృష్టి సారించాం. మౌలిక వసతుల కల్పన, ఉపాధి, ఉద్యోగాలు, నైపుణ్య కల్పనపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాం. 2336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్ లో రోడ్డు కనెక్టివిటీ కల్పిస్తున్నాం. 2027 నాటికి ప్రతీ గిరిజన కుటుంబానికీ సురక్షితమైన తాగునీరు, ఆవాసం కల్పిస్తాం, సోలార్ రూఫ్ టాప్ కూడా ఏర్పాటు చేస్తాం. అడవి తల్లి బాట పేరుతో వెయ్యి కోట్లతో 905 కిలోమీటర్ల రోడ్లు వేశాం. డోలీ మోతలు లేకుండా ఫీడర్ అంబులెన్సులు, 108,104 మొబైల్ మెడికల్ యూనిట్లు ఏర్పాటు చేశాం. అలాగే డిజిటల్ కనెక్టివిటీ కోసం సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నాం. 25 ఏళ్ల క్రితమే అరకు కాఫీకి నాంది పలికాం, ఇప్పుడు ప్రపంచ బ్రాండ్ గా అరకు కాఫీ ఎదిగింది. మరో లక్ష ఎకరాల్లో కాఫీ సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. కాఫీ, మిరియాలు, పసుపు లాంటి వాణిజ్య పంటలకు బ్రాండ్ గా ఏజెన్సీ ప్రాంతం మారాలి. ప్రధాని మోదీ కూడా ఆస్ట్రేలియా ప్రధానికి అరకు కాఫీనే బహుమతిగా ఇచ్చి ప్రమోట్ చేస్తున్నారు. రాష్ట్రానికి వచ్చిన ప్రతీ అతిథికి అరకు కాఫీని బహుమతిగా ఇస్తూ ప్రోత్సాహం కల్పిస్తున్నాం పార్లమెంటు లోనూ అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేయించాం. బెస్ట్ గ్లోబల్ బ్రాండ్ గా దీనిని మారుస్తాం. గిరిజన ప్రాంతాల్లోని అటవీ ఉత్పత్తులకు విలువ జోడించటం ద్వారా మంచి మార్కెటింగ్ కల్పిస్తాం. సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనా పిల్, తేనె, తాటి బెల్లం ఇలా ఉత్పత్తి నుంచి ప్రాసెసింగ్ , బ్రాండింగ్ వరకూ ప్రభుత్వం అండగా ఉంటుంది."అని ముఖ్యమంత్రి వివరించారు.

**ఆదివాసీల సమగ్రాభివృద్ధికి కార్యాచరణ**

"రహదారులు, సురక్షితమైన తాగునీరు లాంటి మౌలిక వసతులు, విద్య, వైద్యంవైద్యం, ఆదాయ వనరుల పెంపు, నైపుణ్య శిక్షణ లాంటి ఐదు అంశాల్లో ఆదివాసీల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఒక్క ఆదివాసీల కోసమే 3 ప్రత్యేక జిల్లాలు ఏర్పాటు చేసి వారికి ప్రాధాన్యత కల్పించాం. ఎటు చూసినా పచ్చదనం కలిగిన ఈ ప్రాంతాల్లో పర్యాటకాన్ని కూడా గణనీయంగా ప్రోత్సహిస్తాం. నేడు చేసుకున్న 19 ఎంఓయూల ద్వారా 60 వేల మందికి లబ్ది కలుగుతుంది. గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా 1.5 లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందిస్తాం. ఐఐటీ, నీట్ లాంటి పోటీ పరీక్షలకు కూడా వారిని సిద్ధం చేసి అందరితో పోటీ పడేలా ప్రోత్సహిస్తాం. జీవో నెంబరు 3 ద్వారా గిరిజన ప్రాంతాల్లో స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా చేశాం. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ జీవోను కొట్టివేశారు. ప్రత్యామ్నాయం గురించి ఆలోచన చేస్తున్నాం. ఆదివాసీల హక్కులు కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. నాణ్యమైన వైద్య సేవలు అందేలా రూ.250 కోట్లతో పార్వతీపురం, సీతంపేట, రంపచోడవరం, చింతూరు, కేఆర్ పురం, శ్రీశైలం లాంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మాణం పూర్తి చేస్తార్". అని సీఎం వివరించారు.

**స్వర్ణాంధ్ర కోసం కలిసి పని చేద్దాం**

"2047 నాటికి స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధన కోసం మనం అంతా పనిచేయాలి. ఆర్థిక అసమానతలు తగ్గి అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందేలా ప్రణాళికలు చేశాం. సూపర్ సిక్స్ తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. పీ4 తో పాటు వివిధ కార్యక్రమాల ద్వారా పేదల్ని ఆదుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నాం. చంద్రబాబు అనే నేను ప్రజల జీవితాలను మార్చి, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తే లక్ష్యం నెరవేరినట్టే. దేశం, రాష్ట్ర అభివృద్ధిలో ప్రతీ పౌరుడూ భాగస్వామి కావాలి. విద్యార్థులకు ఇది అలవాటు చేసేలా ఓ మొక్కను నాటి సంరక్షించేలా గ్రీన్ పాస్ పోర్టు కార్యక్రమం తెచ్చాం. మన పర్యావరణం కోసం మొక్కలు నాటటంతో పాటు వాటిని సంరక్షించటం కూడా మన బాధ్యత. 80 స్వతంత్ర దినోత్సవం లోగా ప్రతీ పౌరుడూ ఓ సంకల్పం తీసుకోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నా. వచ్చే 21 ఏళ్లలో దేశం, రాష్ట్రం అభివృద్ధికి చిరునామాగా మారతాయి." అని సీఎం అన్నారు. అనంతరం అంబేద్కర్ కళావేదిక వద్ద ఏర్పాటు చేసిన గిరిజన ఉత్పత్తుల స్టాళ్లను సీఎం పరిశీలించారు. పాడేరు, రంపచోడవరం, నల్లమల, అరకు, చింతపల్లి, పార్వతీపురం మన్యం తదితర ప్రాంతాల నుంచి ఉత్పత్తులు తయారు చేసి ప్రదర్శించిన గిరిజన మహిళల్ని సీఎం అభినందించారు. గిరిజన ప్రాంతాల్లో తయారు చేస్తున్న ఉత్పత్తులకు బ్రాండ్ రూపొందించి మార్కెటింగ్ చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# మత్తు వేగానికి వైద్య కల బలి!

(మొదటిపేజీ తరువాయి)

ఇద్దరు యువకులు ప్రయాణిస్తున్న కారు, ప్రియాంక ప్రయాణి స్తున్న స్కూటర్‌ను ఢీకొట్టడంతో ఆమెకు అత్యంత తీవ్రమైన తలగాయాల య్యాయి. హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్యం అందిం చినప్పటికీ ఆమెను కాపాడలేకపోయారు. ఆగస్టు 8 నాటికి ఆమె బ్రెయిన్‌డెడ్ పరిస్థితికి చేరినట్లు వార్తలు వెలువడగా, ఆగస్టు 9న వచ్చిన తాజా నివేదికలు ఆమె మృతి చెందినట్లు ధృవీకరించాయి. ప్రియాంక మరణంతో కుటుంబ సభ్యులు, తోటి వైద్య విద్యార్థులు, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ విద్యార్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మరోవైపు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ రాజమహేంద్రవరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

**ఎవరీ ప్రియాంక?**

కానికె ప్రియాంక తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా ఎల్లన్‌పూర్ ప్రాంతానికి చెందినవారు. ఆమె ప్రతిభావంతమైన విద్యార్థినిగా కుటుంబ సభ్యులు, పరిచయస్తులు గుర్తుచేసుకుంటున్నారు. కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన అనంతరం ఉన్నత వైద్య విద్యను కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. తాజా సమాచారం ప్రకారం ఆమె 2026 ఫిబ్రవరిలో రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో డెర్మటాలజీ పీజీ కోర్సులో చేరారు. అందువల్ల కొన్ని సామాజిక మాధ్యమ పోస్టుల్లో ప్రచారం జరుగుతున్న "పీజీ రెండో సంవత్సరం" సమాచారం కంటే, ఆమె ఈ ఏడాదే పీజీలో చేరినట్లు తాజా విశ్వసనీయ నివేదిక స్పష్టం చేస్తోంది. చర్మవ్యాధుల వైద్య నిపుణురాలిగా ఎదిగి రోగులకు సేవ చేయాలన్న ఆమె ఆశయం కొద్ది నెలల్లోనే అర్ధాంతరంగా ముగిసింది.

**ఆగస్టు 3 రాత్రి.. అసలేం జరిగింది?**

రాజమహేంద్రవరంలోని ఏవీఏ రోడ్డులోని ప్రసాదిత్య మాల్ / మల్టీప్లెక్స్ ప్రాంతంలో ఆగస్టు 3 రాత్రి ఘటన చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం, నిందితులుగా పేర్కొంటున్న సూరవరపు దస్వంత్ (24), ఆండ్రూ జోసెఫ్ (23) మద్యం సేవించిన స్థితిలో కారులో మాల్‌కు వచ్చినట్లు ఆరోపణ. మాల్‌లోని సినిమా థియేటర్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా వారు మద్యం సేవించినట్లు గుర్తించిన భద్రతా సిబ్బంది లోపలికి అనుమతించలేదని దర్యాప్తులో వెల్లడైంది. కొన్ని నివేదికల ప్రకారం మాల్ సిబ్బంది బ్రీత్ అనలైజర్ ఉపయోగించి వారు మద్యం సేవించినట్లు గుర్తించారు. దీనిపై నిందితులు భద్రతా సిబ్బందితో వాగ్వాదానికి దిగినట్లు, వారిపై దాడి చేసినట్లు కూడా పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి మాల్ సిబ్బంది ఫిర్యాదుతో ప్రత్యేక కేసు నమోదైంది.

**అదే సమయంలో బయటకు వస్తున్న ప్రియాంక**

అదే సమయంలో జీఎస్ఎల్ మెడికల్ కాలేజీకి చెందిన ప్రియాంక, ఆమె తోటి వైద్య విద్యార్థి సాయి ఉమేష్ మాల్ నుంచి స్కూటర్‌పై బయలుదేరినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఉమేష్ రేడియాలజీ పీజీ విద్యార్థిగా, ప్రియాంక డెర్మటాలజీ పీజీ విద్యార్థినిగా ఒక నివేదిక పేర్కొంది. అక్కడి నుంచి వేగంగా బయటకు వస్తున్న నిందితుల కారు వీరి స్కూటర్‌ను వెనుక నుంచి ఢీకొట్టినట్లు ఆరోపణ.

**ఇక్కడే కేసులో అత్యంత కీలకమైన అంశం ఉంది.**

**ఒక్కసారి కాదు.. పలుమార్లు ఢీకొట్టిందా?**

'సౌత్ ఫస్ట్' ప్రచురించిన పోలీసు వివరాల ప్రకారం, దస్వంత్ నడుపుతున్నట్లు ఆరోపిస్తున్న టాటా నెక్సాన్ కారు ముందుగా స్కూటర్‌ను వెనుక నుంచి రెండుసార్లు ఢీకొట్టింది. అనంతరం ప్రియాంక వెనక్కి తిరిగి చూసిన సమయంలో మాల్ ప్రధాన ద్వారం వెలుపల మరోసారి మరింత బలంగా ఢీకొట్టినట్లు ఆ నివేదిక పేర్కొంది. దాంతో ప్రియాంక, ఉమేష్ ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. ఈ అంశమే సాధారణ రోడ్డు ప్రమాదమా? లేక తెలిసి కూడా ప్రమాదకరంగా వాహనం నడిపారా? అనే కోణంలో పోలీసుల దర్యాప్తును మరింత తీవ్రతరం చేసింది.

**'ప్రియాంకపై నుంచి కారు వెళ్లింది' అనే ప్రచారంపై స్పష్టత**

సోషల్ మీడియాలో, కొన్ని ప్రారంభ వార్తల్లో ప్రియాంక కిందపడిన తర్వాత ఆమెపై నుంచి కారు వెళ్లిందని ప్రచారం జరిగింది. అయితే ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ బాజీలాల్ 'సౌత్ ఫస్ట్'తో మాట్లాడుతూ ఆ వివరాన్ని ఖండించారు. కారు స్కూటర్‌ను పలుమార్లు ఢీకొట్టినట్లు పోలీసుల దర్యాప్తు చెబుతున్నప్పటికీ, కిందపడిన ప్రియాంకపై నుంచి కారు వెళ్లిందన్న అంశం సరైనది కాదని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ప్రచురణలో "కారుతో తొక్కేశారు" అనే పదాన్ని పోలీసు అధికారిక నిర్ధారణ లేకుండా ఉపయోగించడం సముచితం కాదు.

**రోడ్డుపై రక్తపు మడుగులో..**

ఢీకొట్టిన తీవ్రతకు ప్రియాంక తలకు అత్యంత తీవ్రమైన గాయాలయ్యాయి. ఆమెకు పుర్రె ఎముక విరగడం, మెదడుకు తీవ్ర నష్టం జరిగినట్లు వైద్య సమాచారాన్ని ఉటంకిస్తూ నివేదికలు వెల్లడించాయి. ఉమేష్‌కు కూడా గాయాలయ్యాయి. అయితే ప్రియాంకతో పోలిస్తే అతని పరిస్థితి మెరుగ్గా ఉండి, స్థిరంగా ఉన్నట్లు సమాచారం. ఘటన జరిగిన వెంటనే అటుగా వెళ్తున్న వారు స్పందించి ఇద్దరినీ రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి తరలించారు.

**రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు పరుగులు**

ప్రియాంక పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో మెరుగైన న్యూరో వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. చివరకు సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించి వెంటిలేటర్ సహాయంతో చికిత్స అందించారు. ఆమెను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే తలకు తగిలిన తీవ్ర గాయం కారణంగా మెదడు పనితీరు క్రమంగా పూర్తిగా దెబ్బతిన్నట్లు వైద్యులు గుర్తించారు.

**చివరి ఆశగా 'అప్నియా పరీక్ష'**

ప్రియాంకకు బ్రెయిన్‌డెడ్ పరిస్థితి ఉందా? లేదా? అనే అంశాన్ని వైద్యపరంగా నిర్ధారించేందుకు అప్నియా పరీక్ష నిర్వహించే ప్రక్రియ చేపట్టారు. ఆగస్టు 8న వెలువడిన వైద్య సమాచారం ప్రకారం ఆమె శరీరంలో సోడియం స్థాయిలు అధికంగా ఉండటంతో ముందుగా వాటిని నియంత్రించి, అనంతరం బ్రెయిన్‌డెత్ నిర్ధారణకు అవసరమైన పరీక్షలు చేపట్టాలని వైద్యులు నిర్ణయించారు. కుటుంబ సభ్యులకు కూడా ఆమె పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వివరించినట్లు సమాచారం. కూతురు కళ్లు తెరుస్తుందేమో... ఏదైనా అద్భుతం జరుగుతుందేమో... అన్న చిన్న ఆశతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఎదురుచూశారు. కానీ చివరకు ఆ ఆశలు నిలవలేదు.

**బ్రెయిన్‌డెడ్ నుంచి విషాదాంతం**

ఆగస్టు 8న ప్రియాంక బ్రెయిన్‌డెడ్ అయినట్లు వార్తలు వెలువడ్డాయి. అనంతరం ఆగస్టు 9న ప్రచురితమైన తాజా నివేదికలు ఆమె మరణాన్ని ధృవీకరించాయి. 28 ఏళ్ల వయసులోనే ఒక ప్రతిభావంతమైన వైద్య విద్యార్థిని జీవితం ముగియడం రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

**కుమార్తెను కోల్పోయినా.. ప్రాణాలు నిలబెట్టే నిర్ణయం**

తమ కుమార్తెను తిరిగి తెచ్చుకోలేమనే భయంకరమైన నిజాన్ని ఎదుర్కొంటూనే ప్రియాంక తల్లిదండ్రులు మానవత్వాన్ని చాటినట్లు తాజా సమాచారం వెల్లడిస్తోంది. ప్రియాంక అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించినట్లు 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొంది. తద్వారా ఆమె అవయవాల ద్వారా మరికొందరి జీవితాల్లో వెలుగు నింపాలనే కుటుంబ నిర్ణయం తీవ్ర విషాదంలోనూ గొప్ప మానవీయ సందేశంగా నిలిచింది.

**మూడు రోజులు ఆలస్యంగా వెలుగులోకి?**

ఆగస్టు 3న ఘటన జరగగా, ఈ విషయం పెద్దఎత్తున ప్రజల దృష్టికి రావడం ఆగస్టు 6 ప్రాంతంలో జరిగింది. ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఒక్కసారిగా రాష్ట్రవ్యాప్తంగా చర్చ మొదలైంది. దీంతో "ఇంత తీవ్రమైన ఘటన మూడు రోజులపాటు ఎందుకు పెద్దగా బయటకు రాలేదు?", "ప్రారంభ దశలో కేసును ఎందుకు సాధారణ ప్రమాదంగా చూశారు?" అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నలు వెల్లువెత్తాయి. ఈ ఆరోపణలపై పూర్తి వాస్తవాలు పోలీసు దర్యాప్తులోనే తేలాల్సి ఉంది.

**మొదట కేసు.. తర్వాత తీవ్రమైన సెక్షన్**

ఉమేష్ ఇచ్చిన ఆసుపత్రి వాంగ్మూలం ఆధారంగా తొలుత బీఎన్ఎస్ సెక్షన్ 125(ఎ) కింద కేసు నమోదైనట్లు పోలీసులను ఉటంకిస్తూ ఒక నివేదిక పేర్కొంది. మాల్ భద్రతా సిబ్బందితో జరిగిన ఘటనపై మరో కేసులో బీఎన్ఎస్ 118(1), 351(2)తో పాటు 3(5) కింద అభియోగాలు నమోదు చేసినట్లు సమాచారం. ప్రియాంక పరిస్థితి మరింత విషమించడంతో పోలీసులు కేసును తీవ్రతరం చేసి బీఎన్ఎస్ సెక్షన్ 110ను చేర్చినట్లు తాజా తెలుగు మీడియా నివేదిక పేర్కొంది. బీఎన్ఎస్ సెక్షన్ 110 అంటే హత్యగా పరిగణించని నేరపూరిత మానవహత్యకు యత్నంకు సంబంధించిన నిబంధన. ఈ సెక్షన్ కింద గాయం కలిగితే గరిష్ఠంగా ఏడేళ్ల వరకు జైలు శిక్షకు అవకాశం ఉన్నట్లు భారత ప్రభుత్వ అధికారిక చట్టపత్రం పేర్కొంటోంది. అయితే ఇప్పుడు ప్రియాంక మృతి చెందిన నేపథ్యంలో తుది వైద్య నివేదిక, దర్యాప్తు ఆధారంగా మరణానికి సంబంధించిన మరింత తీవ్రమైన సెక్షన్లు జోడిస్తారా? అన్నది కీలకంగా మారింది. దీనిపై పోలీసుల తాజా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

**దస్వంత్, జోసెఫ్‌కు రిమాండ్**

పోలీసులు నిందితులుగా పేర్కొంటున్న దస్వంత్, ఆండ్రూ జోసెఫ్‌లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా ఇద్దరినీ న్యాయ నిర్బంధానికి పంపినట్లు పోలీసులు తెలిపారు. ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 8 నివేదికలో ఇద్దరినీ శుక్రవారం జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు పేర్కొంది.

**సీఎం చంద్రబాబు ఆరా**

ఈ ఘటన తీవ్ర చర్చకు దారితీయడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఆగస్టు 7న ఉన్నతాధికారుల నుంచి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్న సీఎం, ప్రియాంకతో పాటు గాయపడిన ఉమేష్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. నిందితులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుని శిక్ష పడేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని కూడా సీఎం హామీ ఇచ్చినట్లు సమాచారం.

**పురందేశ్వరి తీవ్ర దిగ్భ్రాంతి**

రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కూడా ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒక ప్రతిభావంతమైన యువ వైద్యురాలి భవిష్యత్తు ఈ విధంగా నాశనం కావడం బాధాకరమని పేర్కొంటూ, నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు నివేదికలు పేర్కొన్నాయి.

**రంగంలోకి మహిళా కమిషన్**

ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ కూడా ప్రియాంక ఘటనపై స్పందించారు. ప్రియాంక కుటుంబానికి త్వరగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీని ఆదేశించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసుల నుంచి కోరిన ఆమె, నిందితులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుని విచారణలో ఆలస్యం జరగకుండా చూడాలని సూచించారు. అదే సమయంలో సోషల్ మీడియాలో ఈ కేసుకు సంబంధించి నిర్ధారణ కాని సమాచారం ప్రచారం చేయవద్దని మహిళా కమిషన్ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. తప్పుడు ప్రచారం బాధిత కుటుంబానికి మరింత మానసిక వేదన కలిగిస్తుందని పేర్కొంది.

**విద్యార్థుల ఆగ్రహం.. 'ప్రియాంకకు న్యాయం చేయాలి'**

ఘటనపై విద్యార్థి వర్గాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. రాజమహేంద్రవరంలోని రాజమహేంద్రి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరారు.

**ఇప్పుడు దర్యాప్తు తేల్చాల్సిన కీలక ప్రశ్నలు**

ఈ కేసులో సాధారణ ప్రమాదానికి మించిన అంశాలున్నాయా?

స్కూటర్‌ను ఒకసారి కాకుండా పలుమార్లు ఎందుకు ఢీకొట్టారు?

మాల్ భద్రతా సిబ్బందితో గొడవ జరిగిన తర్వాత నిందితులు ఏ మానసిక స్థితిలో కారును నడిపారు?

సీసీటీవీ దృశ్యాల్లో మొత్తం ఘటన ఏ విధంగా నమోదైంది?

వారి రక్తంలో మద్యం శాతం ఎంత?

వాహనం ఎంత వేగంతో ప్రయాణించింది?

ఘటన అనంతరం నిందితులు అక్కడి నుంచి ఎందుకు వెళ్లిపోయారు?

పోలీసులకు సమాచారం ఎప్పుడు అందింది?

తొలుత నమోదు చేసిన కేసు నుంచి బీఎన్ఎస్ 110 వరకు సెక్షన్లు మార్చడానికి ఆధారాలేమిటి?

ప్రియాంక మరణం తర్వాత ఏ సెక్షన్లు వర్తింపజేస్తారు?

ఈ ప్రశ్నలకు పోలీసుల తుది దర్యాప్తు, ఫోరెన్సిక్ నివేదికలు, సీసీటీవీ ఆధారాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు సమాధానం చెప్పాల్సి ఉంది.

ఒక రాత్రి.. ఒక కుటుంబానికే కాదు సమాజానికే తీరని నష్టం

ఎంబీబీఎస్ పూర్తి చేసింది...

కష్టపడి పీజీ సీటు సాధించింది...

డెర్మటాలజిస్టుగా ఎదగాలనుకుంది...

కేవలం కొద్ది నెలల క్రితమే కొత్త వైద్య జీవితంలోకి అడుగుపెట్టింది...

కానీ ఆగస్టు 3 రాత్రి జరిగిన ఘటన ఆమె జీవిత గమనాన్నే మార్చేసింది.

28 ఏళ్ల ప్రియాంక ఇక తిరిగిరాదు.

ఒక కుటుంబం తమ కూతురిని కోల్పోయింది.

ఒక వైద్య కళాశాల తన విద్యార్థినిని కోల్పోయింది.

సమాజం భవిష్యత్తులో సేవలందించాల్సిన ఒక యువ వైద్యురాలిని కోల్పోయింది.

కానీ ప్రియాంక మరణం ఇప్పుడు మరో పెద్ద ప్రశ్నను సమాజం ముందుంచుతోంది.

మద్యం తాగి స్టీరింగ్ పట్టే వారి చేతుల్లో ఇంకా ఎన్ని అమాయక ప్రాణాలు బలికావాలి?

రోడ్డుపై వాహనం నడిపే ప్రతి వ్యక్తి చేతిలో తన ప్రాణమే కాదు... ఎదురుగా వచ్చే అమాయకుడి ప్రాణం కూడా ఉంటుందనే విషయం ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది.

ప్రియాంకకు న్యాయం చేయడం అంటే కేవలం ఇద్దరు నిందితులకు శిక్ష పడేలా చేయడమే కాదు...

మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన నియంత్రణలు అమలు చేయడం...

పబ్‌లు, మాల్స్, మల్టీప్లెక్స్‌ల వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు పెంచడం...

సీసీటీవీ వ్యవస్థలను సమర్థంగా వినియోగించడం...

ప్రమాదకర డ్రైవింగ్‌పై ఏమాత్రం ఉపేక్ష చూపకుండా చర్యలు తీసుకోవడం కూడా అంతే అవసరం.

**ప్రియాంకకు న్యాయం కావాలి..!**

ఆమె కన్న కలలు అర్ధాంతరంగా ఆగిపోయాయి.

కానీ ఆమెకు జరిగిన అన్యాయం మరో ప్రియాంక జీవితంలో పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఇప్పుడు ప్రభుత్వం, పోలీసులు, న్యాయవ్యవస్థతో పాటు సమాజంపైనా ఉంది.

మత్తు దిగిపోతుంది...

కానీ మత్తులో చేసిన ఒక తప్పు వల్ల పోయిన ప్రాణం తిరిగిరాదు.

## 14 రోజుల్లో 40 లక్షల గడపలు

కేటాయించిన ప్రాంతాల్లో తప్పనిసరిగా పర్యటించాలని, ప్రజలతో మమేకమై ప్రభుత్వ విజయాలను వివరించాలని స్పష్టం చేశారు. క్లస్టర్, మండల స్థాయి నాయకులను ఫోకస్ బూత్‌లకు అనుసంధానించి, సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి గ్రామ స్థాయి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో సమష్టిగా పాల్గొంటున్నారని, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పటిష్ఠం చేయాలని టీడీపీ భావిస్తోంది.

## 'నేనే రాజు.. నేనే మంత్రి' అనే రీతిలో దామచర్ల..

బాలినేని మాట్లాడారు. "దామచర్ల అవినీతిపై ఎవరో కరపత్రం వేశారు. దాని వెనుక నా పాత్ర ఉందని ఆరోపిస్తున్నారు. నా అనుచరులపై కేసులు పెడుతున్నారు. తప్పు చేయని నా వాళ్లను రక్షించుకోకుంటే ఇక రాజకీయాలు ఎందుకు?ఒంగోలులోని బార్లలో సగం షాపులు దామచర్లవే. ఈ విషయంలో విచారణ చేయిస్తే నిజాలు బయటకు వస్తాయి. డ్వాక్రా రుణాల్లో ఎమ్మెల్యే పీఏ కనుసన్నల్లో భారీగా అవినీతి జరిగింది. దామచర్ల అనుచరులు ఇసుక డంప్ ద్వారా రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. రాజుపాలెంలో వందల ఎకరాలు ఆక్రమించి రొయ్యల చెరువులు వేశారు. ఒంగోలులో దామచర్ల అరాచకాలు బాగా పెరిగాయి. సీఎం చంద్రబాబు దర్యాప్తు చేయిస్తే వాస్తవాలు బయటపడతాయి. ఒంగోలులో దామచర్లతో ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చినా నా దగ్గరకు రావాలి.. దగ్గరుండి న్యాయం చేస్తా" అని బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు.

## భక్తుల భారీ రద్దీ

భక్తులు కిలోమీటర్ల మేర బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని అధికారులు వెల్లడించారు. నిన్న (ఆగస్టు 8) మొత్తం 87,658 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 40,606 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.13 కోట్లుగా నమోదైంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు 4.15 లక్షల లడ్డూలను విక్రయించగా, 3.09 లక్షల మందికి అన్నప్రసాదం అందించారు. వారాంతం కావడంతో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగినట్లు తెలుస్తోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పిస్తూ రద్దీని క్రమబద్ధీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. భారీ రద్దీ నేపథ్యంలో, తిరుమలకు వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని టీటీడీ సూచిస్తోంది.

## కేసీఆర్ పరామర్శ

కేసీఆర్, తొలుత సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం గడిపారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంచి నేత అని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లల పేరున చెరో రూ.1 కోటి, ఆయన తల్లి అమృతమ్మ సంరక్షణ కోసం రూ.25 లక్షల చెక్కులను కేసీఆర్ అందించారు. పిల్లల చదువులు, భవిష్యత్తుతో పాటు కుటుంబ సంక్షేమ బాధ్యతలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందనిస్పష్టం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్ రాక సందర్భంగా నల్లబెల్లికి బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద జనం కిక్కిరిసిపోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చి కేసీఆర్ కాన్వాయ్‌కు దారి కల్పించారు. కేసీఆర్ వెంట పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## వైసీపీ నేత చింతాడ రవికుమార్ అరెస్ట్

కారులో మాస్క్ ధరించి వెళ్తుండగా ఆయన్ను పట్టుకున్నారు. పరారీలో ఉన్న సమయంలో రవికుమార్ నిరంతరం ఫోన్లు, సిమ్ కార్డులు మారుస్తూ ఒడిశా, విశాఖపట్నం, బెంగళూరు, అరకు వంటి ప్రాంతాల్లో మకాం మార్చినట్లు పోలీసులు గుర్తించారు. అయితే, తాను డీఎస్పీ కార్యాలయంలో లొంగిపోవడానికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారని రవికుమార్ మీడియాకు తెలిపారు. నిందితుడిని ఆదివారం కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు వెల్లడించారు. రవికుమార్ పరారీకి సహకరించిన విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన వైసీపీ కీలక నేతలపై కూడా చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ కేసులో మొత్తం 28 మందిపై కేసులు నమోదు కాగా, ఇప్పటికే అరెస్టయిన అన్నెపు సంజయ్, బొడ్డేపల్లి రమేష్‌కుమార్ సహా తొమ్మిది మందికి కోర్టు ఈ నెల 21 వరకు రిమాండ్ విధించింది. అనంతరం వారిని అంపోలులోని జిల్లా కారాగారానికి తరలించారు.

# ఎడిటర్ వాయిస్

## జైలు కెళ్తే చాలు టికెట్ గ్యారంటీనా?

వైసీపీ నేతలు ఎవరైనా అరెస్టు అయితే ఆ పార్టీ అధినాయకత్వం నుంచి భారీ రియాక్షన్ వస్తోంది. నేరుగా జగన్ ట్వీట్ చేస్తున్నారు. వైసీపీలో ఇపుడు కొత్త చర్చ సాగుతోంది. పార్టీ కోసం జనంలో ఉండి పోరాడామని ఎవరు చెప్పినా దానికి అధికారిక పత్రం ఏమి ఉంటుంది అన్నదే అంతా అనుకుంటారు. అదే ఏదో విధంగా జనంలోకి వచ్చి పోరాటాలు చేస్తే ఆ మీదట ఎటూ పోలీసులు కేసు కడతారు, అలా అరెస్టు అయి జైలు పాలు అయితే అది నేరుగా అధినాయకత్వం దృష్టిలోకి వెళ్తుందని తప్పకుండా అలాంటి వారికే టికెట్ దక్కుతుందని అంటున్నారు. వైసీపీలో ఈ అరెస్టులు జైళ్ళు ఇలా ఎంతో మంది నాయకులు గత రెండేళ్ళుగా ఎదుర్కొంటూ వచ్చారు, ఇపుడు మరింత మంది జైలులో ఉన్నారు, ఇంకొంతమంది జైలుకు వెళ్ళే బాటలో ఉన్నారని అంటున్నారు.

**భారీ రియాక్షన్‌తో :**

వైసీపీ నేతలు ఎవరైనా అరెస్టు అయితే ఆ పార్టీ అధినాయకత్వం నుంచి భారీ రియాక్షన్ వస్తోంది. నేరుగా జగన్ ట్వీట్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం మీద విమర్శలు కూడా అందులో చేస్తున్నారు. అంతే కాదు వారికి పరామర్శలు ఆ మీదట భారీ ప్రచారం వంటివి వెంటవెంటనే జరిగిపోతున్నాయి. ఇటీవల కాలంలో చూసుకుంటే శ్రీకాకుళం జిల్లాలో మాజీ మంత్రి సీదరి అప్పలరాజు అరెస్టు అయితే జగన్ పరామర్శకు జైలు దాకా వెళ్ళి వచ్చారు. ఆ తరువాత కర్నూలు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే విరూపాక్షని అరెస్టు చేశారు. ఇపుడు శ్రీకాకుళంలో ఆముదాలవలస ఇంచార్జి చింతాడ రవి కుమార్ ని అరెస్టు చేశారు. దీంతో వైసీపీ నేతలు అంతా ఆయనకు సంఘీభావం ప్రకటించారు. అధినాయకత్వం కూడా దీని మీద ఘాటుగా స్పందించింది.

**ఆయనకే ఖాయమా :**

ఆముదాలవలస అంటే మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అందరికీ గుర్తుకు వస్తారు. అలాంటి చోట 2024 ఎన్నికల తరువాత వైసీపీ అధినాయకత్వం చేసిన మార్పులలో భాగంగా యువ నేత అయిన చింతాడ రవికుమార్ కి ఇంచార్జి బాధ్యతలు అప్పగించింది. ఆయన నాటి నుంచి పార్టీని యాక్టివ్ గా చేస్తున్నారు. జగన్ తాజా శ్రీకాకుళం పర్యటనలో ఆయన భారీ జనాలతో తరలి వచ్చారు. ఈ సందర్భంగానే మహిళా ఎస్సైతో జరిగిన గొడవలో ఆయనను అరెస్టు చేశారు. ఇక ఇపుడు ఆయనకు ఆముదలవలస టికెట్ ఖరారు అయినట్లే అని అంటున్నారు. మరో వైపు భూ కబ్జా ఆరోపణల మీద మాజీ స్పీకర్ కుటుంబం ఇబ్బందులు పడుతోంది. దాంతో కూడా చింతాడ రవి కుమార్ కి కలసి వచ్చింది అని అంటున్నారు.

**పోరాడితేన ఫలితం :**

కూటమి మీద నేరుగా పోరాటాలు చేసి అరెస్టు దాకా పరిస్థితిని తెచ్చుకుంటేనే వారు పని చేస్తున్నట్లుగా లెక్క అని అంటున్నారు. ఆ విధంగా వ్యవహరించిన వారికే భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయని అంటున్నారు. కేసులకు భయపడో లేక తమ వ్యాపారాలు దెబ్బ తింటాయనో ఎవరైనా వెనకన ఉంటే వారు పార్టీలోనూ వెనకబడినట్లే అని సందేశాన్ని అధినాయకత్వం పంపిస్తోంది అని అంటున్నారు. పార్టీ ప్రస్తుతం కష్ట కాలంలో ఉంది అని గుర్తు చేస్తున్నారు. అందువల్ల ముందుకు వచ్చి పనిచేసిన వారికే పట్టం కట్టాలన్నదే హైకమాండ్ ఆలోచనగా చెబుతున్నారు. ఈ విధంగా వైసీపీలో మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎంత మంది నేతలు ఉన్నారన్నది కూడా ఒక అంచనా కడుతున్నారు. అలాగే లోకల్ బాడీ ఎన్నికల్లో సైతం పార్టీ కోసం దూకుడుగా రాజకీయం చేసే వారికే చాన్స్ అని కూడా చెబుతున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## బ్రిడ్జిపై నుంచి పడిన ట్రావెల్స్ బస్సు, ఐషర్ వాహనం

**20 మందికి తీవ్ర గాయాలు**



**పామిడి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనంతపురం జిల్లా పామిడి మండలం పొగురూరు సమీపంలో జాతీయ రహదారిపై ఈరోజు తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం జరిగింది. పొగురూరు బ్రిడ్జిపై వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఐషర్ వాహనం ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు రెండు వాహనాలు బ్రిడ్జి పై నుంచి పడిపోయాయి. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 20 మందికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను బయటకు తీసి సమీపంలోని పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బస్సు హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

### గోడకు కన్నమేసి 50 ఐఫోన్లు,

## 150 ఆండ్రాయిడ్ ఫోన్ల అపహరణ



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతిలోని సోనోవిజన్‌లో భారీ చోరీ జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి కొందరు దుండగులు గోడకు కన్నమేసి లోపలికి ప్రవేశించి రూ.1.5 కోట్ల విలువైన 200 మొబైల్ ఫోన్లను కాజేశారు. ఈ ఘటన స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులోని సోనోవిజన్ ఎలక్ట్రానిక్ షోరూమ్‌లో జరిగింది. శనివారం ఉదయం 10 గంటలకు మేనేజర్ గిరి షోరూమ్ తలుపులు తెరవగా షోకేస్‌లోని మొబైల్ ఫోన్ల ఖాళీ బాక్సులు నేలపై పడి ఉండటంతో పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐలు నరేష్, శివకుమార్‌రెడ్డి, అబ్బన్న, సత్యనారాయణలు ఘటనాస్థలానికి వచ్చి పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. షోరూమ్ కుడివైపు గోడకు రంధ్రం వేశాక ఓ దుండగుడు చేతికి గ్లౌజులు వేసుకుని, శరీరంపై తెల్లటి వస్త్రం చుట్టుకుని లోపలికి ప్రవేశించారు. సీసీ కెమెరాల తీగలు కత్తిరించాక మరికొందరు దుండగులు ప్రవేశించారు. 50 వరకు ఐఫోన్లు, 150 ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లను కాజేశారు. వాటి విలువ సుమారు రూ.కోటిన్నర ఉంటుందని అంచనా. అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు షోరూమ్‌ను పరిశీలించి మీడియాతో మాట్లాడారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, ఆరు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేస్తున్నాయని చెప్పారు. చోరీ ముఠా గుజరాత్, బిహార్ గ్యాంగ్‌గా పోలీసులు అనుమానిస్తున్నారు. విజయవాడ, ఖమ్మం పట్టణాల్లోనూ ఇదే తరహా చోరీలు జరిగినట్లు గుర్తించారు.

### యాదాద్రి భువనగిరి జిల్లాలో

## రూ.54 కోట్లు విలువైన డ్రగ్స్ స్వాధీనం



**బీబీనగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీగా డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. బీబీనగర్ మండలం కొండమడుగు వద్ద ముఠా నుంచి రూ.54 కోట్లు విలువచేసే 27 కిలోల మెఫిడ్రిన్, 40 కిలోల అసిటోన్ లిక్విడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ ముఠాలో ఉన్న నలుగురిని అరెస్ట్ చేయగా.. పరారీలో ఉన్న మరికొందరి కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. అరెస్టయిన వారిలో చేతన్ ముధుకర్, ముజామిల్ హక్, అశోక్ గవాండే, రమణమూర్తి ఉన్నారు. ఎండీ అయూబ్, ప్రదీప్ ఠాకూర్, గోపాల్ సిర్పట్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కొండమడుగులోని వేటుకూరి ల్యాబ్స్‌లో అక్రమంగా మెఫిడ్రిన్ తయారు చేసి అక్కడి నుంచి నాగపూర్ తరలిస్తున్నట్లు గుర్తించారు.

## నాటు బాంబులు వేసి దోపిడీకి యత్నం

**అడ్డొచ్చిన వాచ్‌మ్యాన్ గొంతుకోసి హత్య**



**చిత్తూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్ధరాత్రి నాటు బాంబులు వేసి ఫాంహౌస్‌లో దోపిడీకి ప్రయత్నించిన ఘటన చిత్తూరు జిల్లాలో కలకలం రేపింది. దుండగులు వాచ్‌మ్యాన్ గొంతు కోయడంతో ఆయన ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు గ్రామీణ మండలం తాళంబేడు పంచాయతీలో మంగాపురానికి చెందిన పట్టాభినాయుడు యూఎస్ఏలో స్థిరపడ్డారు. ఆయనకు సొంత గ్రామంలో ఉన్న మామిడి తోటలో ఫాంహౌస్ నిర్మించుకున్నారు. దాన్ని ఆయన చెల్లి విజయ, బావ వెంకటేష్‌నాయుడు చూస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు ఫాంహౌస్‌కు వచ్చి రెండు కుక్కలకు మత్తు మందు ఇచ్చారు. తర్వాత చోరీకి ప్రయత్నించగా అడ్డుకున్న బాపట్ల జిల్లా ఆలపాడుకు చెందిన వాచ్‌మ్యాన్ ఆనందరావు (52) గొంతు కోసి చంపేశారు. అనంతరం కిటికీపై నాటు బాంబులు వేశారు. విజయ, వెంకటేష్‌నాయుడు నిద్రలేచి బిగ్గరగా అరవడంతో దుండగులు పరారయ్యారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు అర్ధరాత్రి వెళ్లి పరిశీలించారు. అంతర్రాష్ట్ర ముఠా పనై ఉంటుందని, నాలుగు బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు.

## ఆర్మీ జవాను అదృశ్యం..

**20 రోజులుగా ఆందోళనలో కుటుంబం**

**వరికుంటపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం తోటలచెరువుపల్లెకు చెందిన ఆర్మీ జవాను పగడాల రవి (38) అదృశ్యం ఘటన కలకలం రేపింది. 20 రోజులుగా అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మణిపూర్ రాష్ట్రం టెంగ్నౌపాల్ జిల్లాలో సఫాయివాలాగా విధులు నిర్వహిస్తూ.. సెలవుపై ఇంటికి వస్తుండగా రవి అదృశ్యమయ్యాడు. జూలై 19న నాగాలాండ్‌లోని ధీమాపూర్ రైల్వే స్టేషన్‌లో భార్యతో ఆఖరిసారిగా మాట్లాడిన జవాన్ రవి.. ఆచూకీ ఆ తర్వాత తెలియలేదు. ఒడిశాలోని భద్రక్‌లో చివరిసారి ఫోన్ సిగ్నల్ గుర్తించారు.. అక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. బెంగళూరు రైల్వే స్టేషన్‌లో రవి రవి ఐడీ కార్డు, ఇతర కీలక పత్రాలు లభ్యమయ్యాయి. స్థానిక పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత స్టేషన్‌కు బదిలీ చేశారు.



విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




సోమవారం, 10 ఆగస్టు, 2026

www.viswamvoice.com
సత్యం • సమగ్రం • సమాజ బద్ధత
www.viswamvoice.com

# మంచినీటి కోసం ఎమ్మెల్యేకు వినతిపత్రం

## హామీలు ఎక్కడ అమలు? అని గ్రామస్తుల ప్రశ్న..?



**గోకవరం, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** విశ్వంత్ వాయిస్ న్యూస్: ఆగస్టు 10 తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తంటికొండ గ్రామంలో గత ఎనిమిది నెలలుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులను ఆశ్రయించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు గ్రామస్థులు వినతిపత్రం అందజేసి, తాగునీటి సమస్యతో పాటు ఇతర స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. గ్రామస్థుల కథనం ప్రకారం, గత ప్రభుత్వ హయాంలో తాగునీటి సరఫరా నిరంతరంగా జరిగేదని, ఒకవేళ అంతరాయం ఏర్పడినా త్వరగా పునరుద్ధరించేవారని తెలిపారు. ప్రస్తుతం ఎనిమిది నెలలుగా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ప్రస్తుత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని గ్రామస్థులు విమర్శించారు. ప్రజలు ఓటు వేసి గెలిపించిన తర్వాత తమ సమస్యలను పట్టించుకోవడం లేదని, నాయకులకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. కనీస అవసరమైన తాగునీటి సమస్యను కూడా వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు.

### ఎమ్మెల్యే శిరీష దేవిని

# మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మార్పిఎస్ నాయకులు



**గంగవరం, ఆగష్టు 09 విశ్వం వాయిస్ న్యూస్:** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలం జగ్గంపాలెం గ్రామంలో పర్యటించిన రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవిని మాజీ ఎమ్మార్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నిడమర్తి చిన్నబాబు ఆధ్వర్యంలో పోలవరం జిల్లా ఎమ్మార్పిఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. తొలిత ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం రంపచోడవరం నియోజకవర్గం లో మాదిగలుగా ఉన్నటువంటి మాకు కనీస ప్రాథమిక హక్కులు అయినటువంటి గృహాలతో పాటు , నియోజకవర్గం లో ఉన్న మాదిగల గ్రామాలలో కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని, చదువుకున్న మాదిగ యువతకు ఉద్యోగాల కల్పనకు కృషి చెయ్యాలని ఎమ్మెల్యేకు తెలిపారు. అదేవిధంగా రంపచోడవరం నియోజకవర్గం లో ఉన్న దళితుల కోసం గతంలో అసెంబ్లీ లో ప్రస్తావించిన విషయాల కొరకు మరొక సారి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి ఏజెన్సీ లో మాదిగల కష్టాలను తొలగించాలని తెలిపారు. ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ ఎమ్మార్పిఎస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు 2024 సార్వత్రిక ఎన్నికలలో ఎన్డిఏ కూటమికి మద్దతు ప్రకటిస్తూ ఇచ్చిన ఆదేశాలతో ఎమ్మార్పిఎస్ నాయకులుగా ఎన్డిఏ కూటమి గెలుపునకు సహకరించినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన గెలుపుకు సహకరించి కలవడం పట్ల ఆమె సంతోషించారు. అంతే కాకుండా నియోజకవర్గం లో మాదిగల సమస్యల పట్ల నేరుగా కలవొచ్చు అని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంజెఎఫ్ జిల్లా అధ్యక్షులు చిట్టిబాబు, మాజీ ఎమ్మార్పిఎస్ గంగవరం మండల అధ్యక్షులు మునగాడ ప్రసాద్, సోమరాజు,సన్నీ, రమణ, కృష్ణ, చిన్ని, ప్రసాద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వైద్య విద్యార్థిని యాక్సిడెంట్ కేసు...

# ఎఫ్ఐఆర్ నమోదుకు మూడు రోజులు పట్టిందా? నిజమేంటి!



రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన వైద్య విద్యార్థిని ప్రియాంక కేసుపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం హాట్ టాపిక్ అవుతోంది. ఈ నెల 3న రాత్రి పది గంటల సమయంలో ప్రియాంక, ఆమె స్నేహితుడు ప్రయాణిస్తున్న స్కూటీని కారుతో ఢీకొట్టిన ఇద్దరు నిందితులు అత్యంత పాశవికంగా ఆమె తలను తొక్కించుకుంటూ వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటన మూడు రోజుల అనంతరం బయటకు రాగా, ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి కూడా మూడు గంటలు పట్టిందా? అనే విమర్శలు చెలరేగాయి. అయితే ఇందులో ఎంతమాత్రం వాస్తవం లేదని, రాజకీయం కోసమే కొందరు ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) స్పష్టం చేశారు. ఈ నెల 3న రాత్రి రాజమండ్రి నగరంలోని ప్రసాద్ ఆదిత్యామాల్ బయట స్కూటీపై వెళ్తున్న వైద్యవిద్యార్థిని ప్రియాంకను వెనుక నుంచి కారుతో ఢీకొట్టి ఆమె కిందపడిపోగా నిందితులు కారును వేగంగా ఆమె తలపై నుంచి నడపడంతో బ్రెయిన్ డెడ్ కు గురయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ప్రియాంకను తరలించగా, సమాచారం అందుకున్న గంట వ్యవధిలోనే పోలీసులు వెళ్లి స్టేట్మెంట్ నమోదు చేశారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. రాత్రి పది గంటలకు ప్రమాదం జరిగితే పోలీసులు 11.30 గంటల సమయంలో ఆస్పత్రికి వెళ్లారని, తిరిగి పోలీసుస్టేషన్ కు 12.30 నిమిషాలకు వచ్చారని తెలిపారు. 4వ తేదీ 1.30 నిమిషాలకు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారని వివరించారు. అయితే ప్రమాదంపై మూడు రోజుల తర్వాత పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. దీంతో ఎఫ్ఐఆర్ కూడా మూడు రోజుల తర్వాతే నమోదు చేశారని సోషల్ మీడియాలో కొందరు ప్రచారం చేయడాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తప్పుపట్టారు. ప్రమాదం జరిగిన మూడు గంటల్లోనే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, సమగ్రంగా విచారించి నిందితులను వెనువెంటనే అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారని వివరించారు. ఎఫ్ఐఆర్ ప్రక్రియ పూర్తిగా ఆన్ లైన్ లోనే ఉంటుందని, ఎవరూ మార్చడానికి వీలు ఉండదని గుర్తు చేశారు. ప్రభుత్వంపై బురద జల్లడానికి కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక తలకు తీవ్రగాయం కావడంతో హైదరాబాద్ లో చికిత్స పొందుతున్న వైద్య విద్యార్థిని ప్రియాంక పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని చెబుతున్నారు. ప్రియాంకకు ఆప్నియా టెస్ట్ చేయాలని డాక్టర్లు ప్రయత్నిస్తున్నా, ఆమె శరీరం సహకరించడం లేదని చెబుతున్నారు. సోడియం లెవెల్స్ నియంత్రించడం సాధ్యం కావడం లేదని ఆ కారణంగా వైద్యులు ఏం చేయలేకపోతున్నారని సమాచారం. ప్రస్తుతం పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రియాంక తమ ఇంటికి పెద్ద కుమార్తె అని, చదువు పూర్తయిన తర్వాత తమను బాగా చూసుకుంటుందని అనుకుంటే పరిస్థితి ఇలా అయిపోయిందని ప్రియాంక తండ్రి కన్నీరుమున్నీరు అవుతున్నారు. రాజమండ్రి ఎమ్మెల్యే వాసు తమకు ఫోన్ చేసి ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారని తెలిపారు. కాగా, రాజానగరంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాలలో డెర్మటాలజీ విభాగంలో పీజీ తొలి సంవత్సరం చదువుతున్న ప్రియాంక స్వస్థలం కర్నూలు కాగా, ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్ లో స్థిరపడ్డారు. మద్యం సేవించిన నిందితులు పాశవికంగా కారుతో ప్రియాంకను ఢీకొట్టడంతో ఆమె ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడుతోంది.

# రాజకీయాల మీద మాజీ సీఎం కిరణ్ సంచలన వ్యాఖ్యలు

ఉమ్మడి ఏపీకి చివరి ముఖ్యమంత్రిగా మూడేళ్ళ పాటు పనిచేసిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి వర్తమాన రాజకీయాల పట్ల వైరాగ్యం ప్రదర్శించారు. అంతే కాదు రాజకీయాలు పూర్తిగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలు అంటే ఒకప్పుడు ఉన్న సేవా భావం ఇపుడు లేదని ఇది మంచి వ్యాపారంగా మారింది అని ఆయన అన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన ఒక కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆహ్వానం మేరకు హాజరైన కిరణ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా రాజకీయాల గురించి సంచలన వ్యాఖ్యలు చాలానే చేశారు. చాలా కాలం తరువాత మైకు అందుకున్న ఈ సీనియర్ నేత తన మనసులో మాటలను చెప్పడం విశేషం.

**బెస్ట్ బిజినెస్ అంటే :** రాజకీయాలే బెస్ట్ బిజినెస్‌గా మారాయని కిరణ్ సెటైర్లు వేశారు. ఒకప్పుడు రాజకీయాలలోకి వచ్చిన వారు ప్రజలకు మేలు చేద్దామని చూసేవారు అని అన్నారు. ఇపుడు అలా కాదని మంచి వ్యాపారంగా మారింది అని ఆయన విమర్శించారు. రాజకీయాల్లోకి వచ్చి బాగా సంపాదించుకోవడం మళ్లీ గెలవడం ఇదంతా ఒక విధంగా తయారైన పరిస్థితి అని ఆయన అన్నారు. ప్రజలకు కూడా రాజకీయాల మీద నెమ్మదిగా నమ్మకం విశ్వాసం పోతోంది అని కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. అందుకే వారు కూడా తాత్కాలిక తాయిలాల మీద మోజు పడుతున్నారని ఆయన అన్నారు.



**ఓటర్లది తప్పు కాదు :** తాను 1989లో రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచాను అని ఆయన చెప్పారు. ఆ రోజులలో బూత్ మొత్తానికి కలిపి 12 వందల రూపాయలు దాకా ఇచ్చేవారమని గుర్తు చేసుకున్నారు. కానీ ఇపుడు అలా లేదని ఒక్క ఓటరుకే రెండు వేల రూపాయలు ఇస్తున్నారు అని ఆయన అన్నారు. చదువు లేని వారు ఓటుకు నోటు తీసుకుంటే ఏమో అనుకోవచ్చు అని కానీ నెలకు లక్ష రూపాయల దాకా జీతం తీసుకుంటున్న వారు కూడా బేరాలు పెట్టి మరీ ఓట్లను అమ్ముకోవడం బాధాకరం అన్నారు. ఇలాంటివి చూసినపుడు రాజకీయం తమలాంటి వారు చేయలేరనిపిస్తుందని కిరణ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

**అభివృద్ధికి ఓటు లేదు :** అంతే కాదు అభివృద్ధి చేస్తే ఓట్లు రాలుతాయని అనుకుంటే పొరపాటు అని కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తన నియోజకవర్గంలోని ఒక మారుమూల గ్రామానికి కేవలం అయిదు వందల గడప ఉన్న ఊరికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశాను అన్నారు. అక్కడ అందరికీ ఇళ్ళు కట్టించామని నీళ్ళు ఇచ్చామని రోడ్లు వేశామని అయినా 2009 ఎన్నికల్లో తనకు కేవలం 30 ఓట్ల మెజారిటీ మాత్రమే వచ్చింది అని ఆయన చెప్పారు. అదే ఏ అభివృద్ధి చేయనపుడు 300 ఓట్ల మెజారిటీ వచ్చిందని ఆయన అంటూ జనాల ఆలోచనలు అర్థం చేసుకోవడం కష్టం అన్నారు.

**రాత బాగుంటేనే :** రాజకీయాల్లో విజయానికి ఫార్ములా అంటూ ఏదీ లేదని ఆయన అన్నారు. గెలవడం అయినా ఓడడం అయినా తలరాతను బట్టే ఆధారపడి ఉంటుందని అన్నారు. ఓటర్ల దేవుళ్ళ కరుణ ఎవరి మీద ఉంటే వారు గెలుస్తారు అని అన్నారు. మానవ సంబంధాలే విజయానికి ఎంతో కొంత సహకరిస్తాయని ఆయన అన్నారు. మొత్తం మీద చూస్తే మాజీ సీఎం వర్తమాన రాజకీయాల గురించి తనదైన విశ్లేషణ చేశారు. అంతే కాదు ఇప్పుడు రాజకీయాలు చేయలేమని కూడా వేదాంతం ప్రదర్శించారు. ఆయన వ్యాఖ్యలు అయితే చర్చగా మారుతున్నాయి.

విశ్వం వాయిస్ విశ్వం VOICE TV
మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!
నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!
• ⚡ బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
• రోజువారీ తెలుగు దినపత్రిక PDF
• అంతర్జాతీయ, జాతీయ వార్తలు
• విశ్లేషణాత్మక కథనాలు
VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel
మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి
JOIN NOW
లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E
మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.





# మిషన్ 'మన ద్రాక్షారామం-మన బాధ్యత' సక్సెస్

**ద్రాక్షారామం మార్కెట్ పునర్నిర్మాణశీ పూర్తి - వ్యాపారులకు అందజేత - మోడల్ మార్కెట్‌గా తీర్చి దిద్దుతా**

**వ్యాపారుల కన్నీళ్లు తుడిచి.. జీవనోపాధికి భరోసా - ప్రజల సుఖసంతోషాలే నా ప్రథమ కర్తవ్యం**

**రామచంద్రపురం నియోజకవర్గాన్ని వర్తక, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చేస్తా : మంత్రి సుభాష్**



**ద్రాక్షారామం, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలవడం.. వారి కన్నీళ్లు తుడవడం.. తిరిగి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి నిరూపించారు. ఇటీవల ద్రాక్షారామం మార్కెట్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 48 షాపులు అగ్నికి ఆహుతైన ఘటనలో తీవ్రంగా నష్టపోయిన వ్యాపారులకు అండగా నిలిచి, కేవలం ఒకటిన్నర నెలలోనే నూతన షాపులను నిర్మించి అందించడం ద్వారా మంత్రి సుభాష్ ప్రత్యేకత చాటుకున్నారు. ద్రాక్షారామ మార్కెట్‌లో అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలుసుకున్న వెంటనే మంత్రి సుభాష్ అర్ధరాత్రి సమయంలోనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత వ్యాపారులను పరామర్శించారు. ప్రమాద తీవ్రతను స్వయంగా పరిశీలించి, వ్యాపారుల జీవనోపాధి దెబ్బతినకుండా తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు. మార్కెట్‌ను యుద్ధప్రాతిపదికన పునర్నిర్మించేందుకు తనవంతుగా రూ.20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించడంతో పాటు, దాతలను ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మంత్రి సుభాష్ ఇచ్చిన పిలుపుకు స్పందించిన పలువురు దాతలు, ప్రజలు, వ్యాపారులు పెద్ద మనసుతో ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు.

**45 రోజుల్లోనే కొత్త మార్కెట్‌కు రూపకల్పన**

మంత్రి సుభాష్ చొరవ, దాతల సహకారం, అధికారుల సమన్వయం, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ కృషితో కేవలం ఒకటిన్నర నెలలోనే 48 షాపుల పునర్నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఆదివారం నూతన షాపులను వ్యాపారులకు అందజేయడంతో బాధిత కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. కష్టకాలంలో తమకు అండగా నిలిచి, తిరిగి తమ జీవనోపాధిని నిలబెట్టిన మంత్రి సుభాష్‌కు వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు.

**ద్రాక్షారామం.. ఇక మోడల్ మార్కెట్**

ఈ సందర్భంగా నిర్వహించిన పునర్నిర్మాణ ప్రారంభోత్సవ సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. ప్రజల సుఖసంతోషాలే నా ప్రథమ కర్తవ్యం. ప్రజలకు కష్టం వచ్చినప్పుడు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అండగా నిలవాలి. ద్రాక్షారామ మార్కెట్‌ను మరింత ఆధునికంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్ది మోడల్ మార్కెట్‌గా అభివృద్ధి చేస్తాం అని తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గాన్ని కేవలం రాజకీయ నియోజకవర్గంగా కాకుండా వర్తక, వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ద్రాక్షారామం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో పాటు వ్యాపారపరంగా కూడా మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మార్కెట్ అభివృద్ధితో స్థానిక వ్యాపారులకు, చిన్న వ్యాపారులకు, చిరు వ్యాపారులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

**మన ద్రాక్షారామం-మన బాధ్యతకు దాతల చేయూత**

తన పిలుపునకు స్పందించి "మన ద్రాక్షారామం-మన బాధ్యత" కార్యక్రమానికి చేయూతనిచ్చిన ప్రతి ఒక్క దాతకు మంత్రి సుభాష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కష్టాల్లో ఉన్న తోటి మనిషికి చేయూత అందించడం మనందరి సామాజిక బాధ్యత అని, ద్రాక్షారామ మార్కెట్ పునర్నిర్మాణంలో దాతలు చూపించిన ఔదార్యం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ.. అగ్నిప్రమాదంలో షాపులు కోల్పోయిన వ్యాపారులకు తక్కువ సమయంలోనే నూతన షాపులు నిర్మించి అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కుల మత వర్గ బేధాలు చూడకుండా షాపులు కోల్పోయిన అందరికీ కేటాయించమన్నారు. ప్రభుత్వం కూడా నిధులు మంజూరు చేసి సహకరించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సుభాష్ తనపై ఉంచిన బాధ్యతను స్వీకరించి, సంబంధిత అధికారులు, దాతలు, సిబ్బంది సహకారంతో పునర్నిర్మాణ పనులను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. నియోజకవర్గంలో ఎవరికి కష్టం వచ్చినా.. వారి కుటుంబానికి మేము అండగా ఉంటాం. ప్రజల సమస్యలను మా సమస్యలుగా భావించి పరిష్కారానికి కృషి చేస్తాం అని సత్యం భరోసా ఇచ్చారు.

**మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారు : ఆర్డీవో**

ఆర్డీవో సరళావతి మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న వ్యాపారులు, ప్రజల పట్ల మానవతా దృక్పథంతో స్పందించి వారి జీవనోపాధిని తిరిగి నిలబెట్టేందుకు కృషి చేసిన మంత్రి సుభాష్‌కు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సాటి వారికి సహాయం చేయడమే మానవతా ధర్మంగా భావించి ముందుకు వచ్చిన దాతలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

**ఒక్క మానవతా పిలుపు.. దాతల సహకారం**

మన ద్రాక్షారామం-మన బాధ్యత పిలుపు ఒక కార్యక్రమంగా ప్రారంభమై.. ప్రజల భాగస్వామ్యంతో ఒక సామూహిక ఉద్యమంగా మారిందని నాయకులు పేర్కొన్నారు. ఒక అగ్నిప్రమాదం 48 కుటుంబాల జీవనోపాధిని దెబ్బతీస్తే.. అదే సమయంలో మానవత్వం, దాతృత్వం, ప్రజాప్రతినిధుల చొరవ కలసి ఆ కుటుంబాలకు కొత్త ఆశను అందించాయి. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పునర్నిర్మించిన షాపులను ప్రారంభించారు. సహకారం అందించిన దాతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, ఆర్డీవో సరళావతి, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షులు గుత్తుల సాయి, చిక్కాల దొరబాబు, కర్రి చిట్టిబాబు, మాగాపు అమ్మిరాజు, ద్రాక్షారామం మాజీ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, టీడీపీ రూరల్ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, కూటమి పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు, అధికారులు, వ్యాపారులు, దాతలు తదితరులు పాల్గొన్నారు.

## పొడగట్లపల్లిలో అమ్మ సీతమ్మ సేవాసమితి ద్వితీయ వార్షికోత్సవం





**రావులపాలెం, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమం అమ్మ సీతమ్మ సేవాసమితి ద్వితీయ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రావులపాలెం సిఐ జి రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు వినయం విధేయత సంస్కారం నేర్చుకున్నప్పుడే మంచి సమాజం తయారవుతుందని తెలియజేశారు మంచి కార్యక్రమాలు చేస్తున్నారని ఇలాంటి కార్యక్రమానికి తను ఆహ్వానించినందుకు సంస్థను అభినందించారు. ఇంకా మంచి మంచి కార్యక్రమాలు చేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టెన్త్ క్లాస్ అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు వాళ్ళ తల్లిదండ్రుల సమక్షంలో వాళ్లను సత్కరించి వాళ్ళను ప్రోత్సహించారు. పొడగట్లపల్లి గ్రామపంచాయతీలో స్వీపర్లుగా పనిచేయుచున్న వారి సేవలకు కృతజ్ఞత తెలపడం మన బాధ్యతని వారిని పూలమాలతో శాలువాతో ఒక జత బట్టలు వారికి ఇచ్చి ఘనంగా సత్కరించారు.నిరుపేదలకు దుప్పట్లు పళ్ళు రొట్టెలు ప్యాకెట్లు పంచిపెట్టి అంగరంగ వైభవంగా వచ్చిన వారందరికీ రుచికరమైన భోజన విందు ఏర్పాటు చేసి చాలా కోలాహలంగా ఆనందకరంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సాన బోయిన బాలాజీ సానబోయిన శ్రీను అనే ఇద్దరితో మొదలై 200 మంది సభ్యులుగా సమాజసేవే లక్ష్యంగా రెండు సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న అమ్మా సీతమ్మ సేవా సమితి పేదలు వృద్ధులు, విద్యార్థులు మరియు అవసరంలో ఉన్న వారికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తోంది ఈ సందర్భంగా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు సమాజంలో సేవా భావాన్ని పెంపొందించడం ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం యువతను సేవా కార్యక్రమాలపై ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలకు సేవా సమితి ప్రాధాన్య త ఇస్తోంది. ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమానికి ప్రజలు సేవా కార్యకర్తలు దాతలు అభిమానులు పెద్దలు, పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు .సేవే లక్ష్యం సమాజమే కుటుంబం అనే నిరంతతో అమ్మ సీతమ్మ సేవాసమితి భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామనితెలిపారు.




మోడరన్ డిగ్రీ కాలేజీలో

# అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం



**రామచంద్రపురం, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ అనుబంధ సంస్థయిన లయన్ జి.వి. రావు డిగ్రీ కాలేజీలో బీఎస్సీ కి సంబంధించి కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ డేటా సైన్స్ కోర్సులను మేజర్ గా అందజేస్తున్నట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివిరావు ఆదివారం తెలిపారు. అదేవిధంగా బి సి ఏ ( కంప్యూటర్ అప్లికేషన్స్ )బి బి ఏ (డిజిటల్ మార్కెటింగ్), బీకాం (జనరల్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2026- 27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు రావు తెలిపారు. అత్యుత్తమ వార్షిక ప్రణాళిక, అనుభవం, అర్హత కలిగిన అధ్యాపక బృందం, అడ్వాన్స్ కంప్యూటర్ సైన్స్ ల్యాబ్ లు, విశాలమైన డిజిటల్ లైబ్రరీ, గెస్ట్ ఫ్యాకల్టీ క్లాసులు, స్కిల్స్ డెవలప్మెంట్ సాఫ్ట్ స్కిల్స్ పై ప్రత్యేక శిక్షణ,సురక్షితమైన కాలేజీ బస్సు సౌకర్యం తదితర ప్రమాణాలు కలిగి ఉన్నామని,తమ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతి సెమిస్టర్ నందు అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారని ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తమ కాలేజీ నందు లిమిటెడ్ సీట్స్ మాత్రమే ఉన్నట్లు ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. తమ కళాశాల కోడ్ 097 అని తెలిపారు. మరిన్ని వివరాలకు 08857-242489 ఫోన్ నెంబర్ సంప్రదించాలని తెలిపారు.తరచు క్యాంపస్ సెలక్షన్లు కూడా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యకు చిరునామా

# గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ రామచంద్రపురం

## 2026-27 ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**రామచంద్రపురం, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం పట్టణంలో 2014లో స్థాపించిన గవర్నమెంట్ డిగ్రీ కళాశాల పరిసర విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ఏకైక కళాశాల అని తెలియజేయుటకు సంతోషిస్తున్నాం. ఈ విద్యా సంవత్సరంలో కళాశాల అందిస్తున్న వివిధ కోర్సులలో చేరుటకు అడ్మిషన్లు ప్రారంభమైనవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాల ప్రకారం ఆన్లైన్ అడ్మిషన్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఏ ఎం డి సి) ద్వారా అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. కందికట్ల చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రస్తుతం కళాశాలలో బీకాం ఆనర్స్ జనరల్ ,మరియు కంప్యూటర్ అప్లికేషన్స్, బి ఎ ఎకనామిక్స్ మరియు స్పెషల్ తెలుగు, బిఎస్సి మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, బోటనీ మరియు ఆక్వా కల్చర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కళాశాలలోని సౌకర్యాల విషయానికొస్తే.. విశాలమైన తరగతి గదులు, అడ్వాన్స్ సాఫ్ట్వేర్ కలిగిన రెండు కంప్యూటర్ ల్యాబ్లు, విభాగాల వారీగా డిజిటల్ క్లాస్ రూమ్ లు, అతిపెద్ద గ్రంథాలయం, విశాలమైన క్రీడా మైదానం, కేంద్ర ప్రభుత్వ నిధులు (పీఎం ఉష పథకం) ద్వారా ప్రస్తుతం ఉన్న భవనానికి చేర్చి ఐదు కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న 14 గదులతో రెండు అంతస్తుల భవనం, విద్యార్థులకు నైపుణ్యత ఇచ్చే సర్టిఫికెట్ కోర్సులు, పి. హెచ్.డి. లు చేసి, అపార అనుభవం, అర్హతలు కలిగిన అధ్యాపక బృందం, విద్యలో మంచి ప్రతి కనబరిచిన విద్యార్థులకు ఎండోమెంట్ బహుమతులు, ప్రోత్సాహకాలు, కళాశాల విద్యార్థుల సమస్యను సత్వరమే పరిష్కరించగల అధ్యాపకేతర బృందం, డిస్టెన్ కమిటీ బాలికల కొరకు ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, సేవా కార్యక్రమాలు నేర్పే రెడ్ క్రాస్, ఎన్.ఎస్.ఎస్ మరియు అనేక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని లిఫస్ట్ పేజ్ అడ్మిషన్లు ఈనెల 11 వ తారీకు లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వెబ్ ఆప్షన్స్ 15 నుంచి 19వ తారీకు వరకు జరుగుతాయని అడ్మిషన్ అలాట్మెంట్ 26వ తారీఖున జరుగుతుందని ప్రిన్సిపాల్ డా.కె.చిట్టిబాబు వివరించారు. అడ్మిషన్ కాబోయే విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు కళాశాలకు విచ్చేసి ఈ సౌకర్యాలు అన్నీ పరిశీలించి, అడ్మిషన్ కమిటీ ద్వారా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను సంప్రదించి ప్రవేశం పొందాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు అడ్మిషన్ల కన్వీనర్ డాక్టర్.ఎన్.వి.రమణను 9849373773, 885349 9180, 96989454, 9603219797 ఈ నెంబర్ల ద్వారా సంప్రదించాలని తెలియజేశారు.

# ఐక్యతే మన బలం

## క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్మరించుకున్న పవన్ కల్యాణ్



**అమరావతి, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ, ఆ మహోద్య మంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమర యోధులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళులర్పించారు. శనివారం ఆయన 'ఎక్స్' వేదికగా ఈ మేరకు తన సందేశాన్ని పంచుకున్నారు. దేశ చరిత్ర గతిని మార్చి, భారతీయ ఆత్మను మేల్కొల్పిన మహోన్నత ఘట్టం క్విట్ ఇండియా ఉద్యమమని ఆయన కొనియాడారు. "1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ ఇచ్చిన 'డూ ఆర్ డై' (సాధించు లేదా మరణించు) పిలుపు కోట్లాది మంది భారతీయుల్లో అచంచలమైన దేశభక్తిని, ధైర్యసాహసాలను నింపింది. ఈ నినాదం స్వాతంత్ర్య పోరాటాన్ని ఉవ్వెత్తున ఎగసిన జాతీయోద్యమంగా మార్చింది" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మాతృభూమి విముక్తి కోసం ప్రాణత్యాగాలు చేసిన ఆ మహనీయులకు తాను శిరస్సు వంచి ప్రణమిల్లుతున్నట్లు తెలిపారు. భారతదేశ వాస్తవిక శక్తి ప్రజల ఐక్యతలో, సవాళ్లను అధిగమించాలనే సమష్టి సంకల్పంలోనే ఉందని ఈ ఉద్యమం మనకు గుర్తుచేస్తోందన్నారు. పటిష్టమైన, స్వయం సమృద్ధ, అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించడం ద్వారానే ఆ వీరుల కలలకు, వారి త్యాగాలకు సరైన న్యాయం చేకూరుతుందని పవన్ కల్యాణ్ తన పోస్టులో వివరించారు.

# గంగాలమ్మ తల్లి మమ్ములను కరుణించు

## సకల దేవతా మూర్తులకు జలాభిషేకం నిర్వహించిన రైతులు



**కోటనందూరు, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** వరుణుడు కరుణించాలని గంగమ్మ తల్లికి మరియు సకల దేవతా మూర్తులకు జలాభిషేకము పాలాభిషేకము చేశారు. కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం, ఎస్ఆర్ పేట గ్రామంలో పార్టీలకతీతంగా కులమతాలకు అతీతంగా వర్షాలు కురవాలని స్థానిక రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు తెలుగుదేశం మండల పార్టీ ప్రెసిడెంట్ పోతల సూరిబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు నెల నాటికి 90% వరి నాట్లు పూర్తయ్యేవని, ఈ సంవత్సరము ఎలినినో ప్రభావం వలన సకాలంలో వర్షాలు లేక రైతులు ఆందోళనలో ఉన్నారని తెలియజేశారు. సకల దేవతలకు గ్రామం మొత్తం సామూహికముగా పూజలు నిర్వహించామని, ఈ పూజలు నిర్వహించడం వలన వరుణ దేవుడు కరుణించి వర్షాలు పడతాయని ఆశతోగంగాలమ్మ అమ్మవారిని కూడా పూజించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ తాతబాబు, సబ్బవరపు అప్పలనాయుడు, తమరాన అచ్చిరాజులు, తమరాన సత్తిబాబు మరియు గ్రామ మహిళలు రైతులు ప్రజలు కార్యక్రమంలో పాల్గొని జలాభిషేకం పాలాభిషేకం నిర్వహించారు.

# పేకాట ఆడుతున్న 12 మంది అరెస్ట్

## రూ.5,080 నగదు స్వాధీనం చేసుకున్న కాకినాడ జిల్లా పోలీసులు



**కాకినాడ, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ముందస్తు సమాచారం ఆధారంగా పెద్దాపురం ఎస్ఐ వి.పాపారావు సిబ్బందితో కలిసి ఈరోజు పెద్దాపురం కాకరవారి వీధిలోని వేప చెట్టు వద్ద పేకాట ఆడుతున్న 12 మంది వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.5,080 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జూద క్రీడలు, కోడి పందాలు, క్రికెట్ బెట్టింగ్‌లు తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ గారు హెచ్చరించారు.

# శ్రీ ధర్మ జ్యోతి ఆలయం 20వ వార్షికోత్సవ వేడుకలు





**కోటనందూరు, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం, తిమ్మరాజుపేట గ్రామంలో శ్రీ ధర్మ జ్యోతి ఆలయం 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. శ్రీ శ్రీ శ్రీ దివ్య అవతార్ జ్యోతిర్మయ ప్రభువులు వారి సేవకులు సిహెచ్ దేవ మూర్తి వారి ఆధ్వర్యంలో శ్వేత వర్ణ జెండా ఆవిష్కరణ, బాబా వారికి ఆరాధన, సహజ జ్యోతి వారి దర్శనం, గురుదర్శన పుస్తకావిష్కరణ, శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానం అర్చకుడు కోటమర్తి శ్రీరామచంద్రమూర్తికి సత్కారం, బడి పిల్లలకు పలకల పంపిణీ, అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవ మూర్తి మాట్లాడుతూ విశ్వశాంతి కొరకై ధరణిలో అవతరించిన మహాత్ములు వారి ప్రాణాలు సైతం సమర్పించి మానవజాతిని సంరక్షించాలని ప్రేమతో సత్యాన్ని ప్రకటించిన నేటి శ్రీ శ్రీ శ్రీ దివ్య అవతార్ జ్యోతిర్మయి ప్రభువుల వారు ఈ భూమిలో అవతరించి దేశ నలుమూలల వారి శాంతి ప్రవచనాలతో శాంతి జ్యోతి వెలుగులలో వెలిగొందాలని కోరికలతో వారు అలరించిన దివ్య సూక్తి మౌనమే మహా యంత్రం జ్ఞానం దివ్య పూజ అహింసా పరమాత్మ ధర్మం అని అన్నారు. దీనికి ఉదాహరణగా ధర్మరాజు భీష్మలవారిని తాత ధర్మములన్నిటికంటే ఏది ఉత్తమమో ధరణి అడగగా ఏనుగు పాదము కింద సర్వజీవుల పాదములు ఇమిడి ఉన్నట్లు అహింసో పరమోత్తమ ధర్మం కింద ఇమిడి ఉన్నదని "అహింసా మార్గం మానవాళి శాంతి మార్గం" అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టి మల్లికార్జునరావు, ఎస్ రామారావు, ఏ జగ్గారావు, కరక పైడన్న ,బి ప్రసాద్, ఏ సత్యనారాయణ, రమణ స్థానిక బాబా భక్తులు బర్ల నరసింహమూర్తి, బర్ల వెంకి నాయుడు, కొల్లు బాబ్జి, బర్ల గవర్రాజు, మేకల వెంకటరమణ, బర్ల అప్పలరాజు మరియు బాబా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బోండా రీచార్జి...మ్యాటర్ అదేనా ?




తెలుగుదేశం పార్టీలో ఫైర్ బ్రాండ్ ఇమేజ్ తో ఒకప్పుడు వెలుగు వెలిగిన వారు విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు. ఆయన అప్పట్లో అంటే 2014 నుంచి 2019 మధ్యలో టీడీపీ వైపు నుంచి బలమైన వాయిస్ వినిపిస్తూ పెద్ద సంఖ్యలో ఉన్న వైసీపీ ఎమ్మెల్యేలను ధీటుగా ఎదుర్కొనేవారు. ఇక 2019 నుంచి 2024 మధ్యలో కూడా ఆయన ప్రతిపక్షంలో పార్టీ ఉన్నపుడు గట్టిగానే పోరాటాలు చేసేవారు. అయితే 2024 తరువాత మాత్రం ఆయన కొంత సైలెంట్ అయ్యారు అని ప్రచారం సాగింది. ఇక ఈ మధ్యనే దివంగత నేత ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో బోండా ఉమా చేసిన కొన్ని కామెంట్స్ రాజకీయ రచ్చకు దారి తీసాయి. దాంతో ఆయన టీడీపీ అధినాయకత్వం నియమించిన త్రీ మెన్ కమిటీ ముందు వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

**వైసీపీ మీద దూకుడుతో :** ఇదిలా ఉంటే తాజాగా వైసీపీ మీద బోండా ఉమా చేస్తున్న దూకుడు ఒక లెవెల్ లో ఉంది. వైసీపీ నేతలు ఎవరైనా చంద్రబాబుని కానీ లోకేష్ ని కానీ ఏమైనా అంటే చూస్తూ ఊరుకోమని బోండా ఉమా హాట్ వార్నింగ్ నే వైసీపీ నేతలకు ఇచ్చారు. తాను అసలు ఎవరినీ వదిలిపెట్టేది లేదని కూడా ఆయన స్పష్టం చేశారు. ఇక వైసీపీ ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని నిరసన శిబిరాలను నిర్వహిస్తోంది. తన నియోజకవర్గంలో జరుగుతున్న వైసీపీ కార్యక్రమాలను బోండా ఉమా తానే స్వయంగా వచ్చి అడ్డుకున్నారు. దాంతో అక్కడ రాజకీయ వేడి రాజుకుంది.

**మళ్ళీ పాత బోండాగా :** హైకమాండ్ దృష్టిలో పడేందుకే బోండా ఉమా ఈ విధంగా స్ట్రాంగ్ గానే వైసీపీ మీద విరుచుకుపడుతున్నారని అంటున్నారు. ఆయన ఈ మధ్య చేసిన కొన్ని వ్యాఖ్యల ఫలితంగా హైకమాండ్ దృష్టిలో కొంత ఆగ్రహానికి గురి అయ్యారని అంటున్నారు. అయితే తాను అధినాయకత్వానికి సదా విధేయుడిని అని బోండా ఉమా త్రీ మెన్ కమిటీ ముందు వివరణ ఇచ్చిన తరువాత మీడియా ముఖంగా ప్రకటించారు. ఇపుడు ఆయన తన జోరు పెంచడం ద్వారా తాను చేసిన ప్రకటనల ప్రకారమే ముందుకు సాగుతున్నారని అంటున్నారు. అదే విధంగా పార్టీ కోసం ఎందాకైనా అని బోండా ఉమా స్పష్టం చేయడం ద్వారా టీడీపీలో కొత్త హుషార్ ని తెచ్చారని అంటున్నారు.

**రాజధాని ప్రాంతంలో :** ఇక అమరావతి రాజధాని ప్రాంతంలో ఇంతకాలం టీడీపీకి బలమైన గొంతుక అన్నది తగ్గింది అన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇపుడు బోండా ఉమా దానిని భర్తీ చేస్తున్నారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే బోండా ఉమా తిరిగి తన ఫైర్ బ్రాండ్ ఇమేజ్ తో ముందుకు వస్తున్నారు. వైసీపీకి ఘాటుగానే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇప్పటిదాకా క్రిష్ణా జిల్లాలో మంత్రి కొల్లు రవీంద్ర మాత్రమే ఎక్కువగా వైసీపీని ఎదుర్కొంటూ వచ్చారు. ఇపుడు ఉమా కూడా జత కావడంతో టీడీపీ సైకిల్ పరుగులు తీయడం ఖాయమని అంటున్నారు. అయితే ఈ దూకుడు వైసీపీకి చాన్స్ ఇవ్వకుండా బూమరాంగ్ కాకుండా జాగ్రత్త పడాలని అంటున్నారు. లేకపోతే ప్రత్యర్థికి అస్త్రాలు అందించినట్లు అవుతుందని అంటున్నారు. మొత్తానికి బోండా ఉమా తన మీద ఇటీవల కాలంలో వచ్చిన విమర్శలకు తన పెద్ద నోరుతో తగిన జవాబు చెబుతున్నారు. ఆచరణలో కూడా ఆయన అదే స్పీడ్ తో ముందుకు సాగుతున్నారు.

# పవన్ ఫుల్ ఫోకస్ వాటి మీదనే...టార్గెట్ అదేనా ?

జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైలెంట్ గా తన పని తాను చేసుకుని పోతున్నారు. ఒక వైపు పార్టీ అధినేతగా జనసేనను సంస్థాగతంగా బలోపేతం చేసే కార్యక్రమాలు చేస్తున్నారు. మరో వైపు ఉప ముఖ్యమంత్రిగా తన దగ్గర ఉన్న ప్రాధాన్యత కలిగిన శాఖలను పూర్తిగా అవగాహన చేసుకుని వాటి పనితీరులో మెరుగుదల చూపిస్తున్నారు. అటవీ శాఖ ద్వారా గిరిజన ప్రాంతాలలో రోడ్లు వేయించి అడవి తల్లి బాట పేరుతో వారికి దారి చూపిస్తున్నారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నారు. పనిలో పనిగా పర్యావరణ శాఖ మీద కూడా ఆయన దృష్టి పెట్టారు. ఇటీవల అనకాపల్లి జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం అయిన పంచదార్ల వద్ద అక్రమ మైనింగ్ జరుగుతోందని తెలిసి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నో మైనింగ్ జోన్ గా ప్రకటించాలని కూడా సూచించారు.

**బూత్ లెవెల్ నుంచి :** ఇక పార్టీ పరంగా చూస్తే పవన్ కళ్యాణ్ బూత్ లెవెల్ నుంచి జనసేనను పటిష్టం చేసే కార్యక్రమం ముమ్మరం చేశారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారికే పెద్ద పీట వేస్తున్నారు. అంతే కాక వారు జనసేనలో ఏళ్ళ తరబడి పనిచేసేలా ఉండడమే అర్హతగా చూసుకుంటున్నారు. రేపు జరిగే స్థానిక ఎన్నికల్లో జనసేన జెండా ఎత్తిన వారికే సీట్లు అన్న విధానం కూడా తీసుకుని రావాలని చూస్తున్నట్లుగా చెబుతున్నారు. ఈ విధంగా జనసేనను నమ్ముకుంటే తమకు న్యాయం జరిగింది అన్నది పార్టీ క్యాడర్ అంతా అనుకుని సుదీర్ఘ కాలం పాటు గట్టిగా నిలబడేలా జనసేన అధినాయకత్వం పక్కాగా ప్రణాళికలను రచిస్తోంది అని అంటున్నారు.

**ఆ వైపు చూడడం కంటే :** ఇక దైనందిన విషయాల్లో ప్రత్యర్థుల మీద విమర్శలు ఉంటూ ఉంటాయి. వైసీపీ మీద ప్రతీ రోజూ విమర్శలు చేసే విధానానికి జనసేన దూరంగా ఉంటోంది. అందుకే ఆ పార్టీ తన లక్ష్యాలను ఏమిటో నిర్దేశించుకుని వాటికి అనుగుణంగా ముందుకు సాగుతోంది అని అంటున్నారు. వారిని వీరు వీరిని వారు విమర్శించుకోవడం వల్ల ఉపయోగం లేదని మీడియాలో హైప్ క్రియేట్ కావడం తప్ప గ్రౌండ్ లెవెల్ లో ఏమీ ఉండదని జనసేన భావిస్తోంది. అందుకే జనసేన ఈ తరహా విమర్శల రాజకీయానికి దూరంగా ఉంటోంది అని అంటున్నారు.



**అక్కడే చూపు అంటూ :** ఇక జనసేన 2029 ఎన్నికల మీదనే తన చూపు నిలిపింది అని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కువ సీట్లు పొత్తులో భాగంగా కోరాలీ అంటే ముందు పార్టీగా బలపడాల్సిన అవసరం ఉందని జనసేన నమ్ముతోంది. పార్టీకి బూత్ లెవెల్ నుంచి క్యాడర్ అలాగే ద్వితీయ తృతీయ శ్రేణి నేతలతో పాటు నియోజకవర్గాన్ని నడిపించే బలమైన నాయకత్వం ఉంటే కచ్చితంగా ఎక్కువ సీట్లు తీసుకోవచ్చు అని భావిస్తోంది. వచ్చే ఎన్నికలు జనసేనకు ఒక విధంగా కీలకం అని అంటున్నారు. ఎక్కువ సీట్లు తీసుకుని 2024 మాదిరిగానే సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ తో గెలిస్తే కచ్చితంగా ఆ తరువాత ఏర్పడే ప్రభుత్వంలో ముఖ్యమైన పాత్ర పోషించేందుకు వీలు ఉంటుందని కూడా ఆలోచిస్తోంది అని అంటున్నారు. మొత్తానికి జనసేన దీర్ఘ కాలం ఆలోచనలు చేస్తోంది. అందుకే సైలెంట్ గానే పవన్ తన పని ఏంటో చేసుకుని పోతున్నారు అని అంటున్నారు.



# లాల్ దర్వాజా సింహవాహిణి అమ్మవారిని దర్శించుకున్న విజయ్ దేవరకొండ

## సోదరుడు ఆనంద్, దర్శకుడు సందీప్ వంగాతో కలిసి ప్రత్యేక పూజలు - బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లింపు - విజయ్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చిన అభిమానులు

**హైదరాబాద్, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్‌లో బోనాల పం డుగ వేడుకలు అత్యంత వైభ వంగా జరుగుతున్నాయి. నగ రంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతు న్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ పాతబస్తీలోని ప్రసిద్ధ లాల్ దర్వాజా సింహ వాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు సోదరుడు, నటుడు ఆనంద్ దేవరకొండ, ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బోనాల పండుగ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఈ ముగ్గురూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని ఆశీస్సులు అందుకున్నారు. విజయ్ దేవరకొండ, సందీప్ రెడ్డి వంగా కలిసి ఆలయానికి రావడంతో అక్కడి వాతావరణం మరింత సందడిగా మారింది. తమ అభిమాన హీరో వచ్చాడని తెలుసుకున్న ఫ్యాన్స్, స్థానిక యువత ఆయన్ను చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దర్శనం అనంతరం బయటకు వస్తున్న విజయ్ దేవరకొండను ఫోటోలు తీసేందుకు అభిమానులు ఎగబడ్డారు. దీంతో ఆలయ పరిసరాల్లో కాసేపు కోలాహలం నెలకొంది. ప్రతి ఏటా జరిగే బోనాల ఉత్సవాల్లో సామాన్య భక్తులతో పాటు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.



# అమ్మవారు దర్శనమిచ్చి బోనాలు కోరారు..

## భక్తిశ్రద్ధలతో గుబ్బాలమ్మకు బోనాల సమర్పణ







**గోకవరం, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** విశ్వంత్ వాయిస్ న్యూస్: ఆగస్టు 10 గోకవరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని గ్రామదేవత మాతృశ్రీ గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తి పారవశ్యంతో బోనాల ఉత్సవం ఘనంగా జరిగింది. సాయిబాబా పీఠాధిపతి గురువు శ్రీ లలితా సాయి మాతాజీ పీఠంపై ధ్యానంలో ఉండగా, అమ్మవారు దర్శనమిచ్చి “నా చెల్లి గ్రామదేవత మాతృశ్రీ గుబ్బాలమ్మకు బోనాలు సమర్పించండి” అని ఆదేశించినట్లు ఆమె తెలిపారు. ఈ దివ్య సందేశంతో భక్తులు విశేష భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోకవరం పరిసర ప్రాంతాలతో పాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు సంప్రదాయ



వస్త్రధారణలో బోనాలను తలపై మోసుకుంటూ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మంగళహారతులు, అమ్మవారి నామస్మరణల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుటుంబ సుఖశాంతి, ఆయురారోగ్యాలు, పంటల సుభిక్షం, గ్రామాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామదేవతగా మాతృశ్రీ గుబ్బాలమ్మను విశ్వసించే భక్తులకు ఆమె కోరిన కోరికలను నెరవేర్చే తల్లిగా పేరుగాంచిందని, అనేక మంది తమకు జరిగిన అనుభవాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అమ్మవారి మహిమలు తరతరాలుగా భక్తుల విశ్వాసాన్ని మరింత బలపరుస్తున్నాయని ఆలయ పెద్దలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆచంట రాజు, వైస్ చైర్మన్ గండ్రెడ్డి సన్యాసిరావు, ముఖ్య సలహాదారు యళ్ల శేషు, ట్రెజరర్ మమ్ముడివరపు నారాయణరావు, కర్రీ శివ, అలమండ శివాజీ, వెన్ను వీరబాబు తదితర ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఘనంగా రంగరాజ బట్టర్

# 80వ జన్మదిన వేడుకలు

## రంగరాజ బట్టర్‌ను సత్కరించిన బత్తుల దంపతులు



**కోరుకొండ, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ వంశపారం పర్య ధర్మకర్త ఎస్పీ రంగరాజ బట్టర్ 80వ జన్మదిన వేడుకలు గ్రామస్థుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ ధర్మకర్త రంగరాజ బట్టర్ స్వగృహానికి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి రంగరాజ బట్టర్ దంపతులకు పూలమాలవేసి సాల్వతో ఘనంగా సత్కరిస్తూ, పాదాభివందనాలు చేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతులు రంగరాజ బట్టర్ జన్మదినాన్ని పరిష్కరించుకొని, రంగరాజ బట్టర్ దంపతులకు పూలమాలవేసి సాల్వతో ఘనంగా సత్కరిస్తూ పాదాభివందనాలు చేసి, రంగరాజ బట్టర్ దంపతుల ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో రంగరాజ బట్టర్ దంపతులు, బత్తుల దంపతులు, అడ్డాల శ్రీను, అడపా శ్రీనివాస్,తెలగంశెట్టి శ్రీనివాస్, కటకం చలం, యర్రంశెట్టి పోలారావు, తన్నీరు తాతాజీ, ముక్క రాంబాబు, త్రినాధ్, తెలగంశెట్టి శివ, తాటికొండ బుజ్జి, గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బత్తుల చేతుల మీదుగా సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

**కోరుకొండ, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించి అర్జీలను స్వీకరించారు. ఆదివారం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో రాజానగరం నియోజకవర్గనికి చెందిన పలువురుకి వైద్యం అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను బలరామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. బుచ్చెంపేట గ్రామానికి




చెందిన గుడి మాణిక్యం వెంకటరాజుకు లక్ష 59 వేలు,గాడాల గ్రామానికి చెందిన భాస విజయలక్ష్మికి 59 వేలు, శ్రీరంగపట్నం గ్రామానికి చెందిన మల్లా రామకృష్ణకు 33 వేలు,కాళ్ళ కృష్ణకుమారికి 39 వేలు, మునగాల గ్రామానికి చెందిన నల్లి పూసా కి 52 వేలు,రాఘవాపురం గ్రామానికి చెందిన బండి అన్నపూర్ణకి 49 వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అడ్డాల శ్రీను,యర్రంశెట్టి పోలారావు, అడపా శ్రీనివాస్,ముక్క రాంబాబు, తన్నీరు తాతాజీ, దేవన దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు కార్యకర్తలు వీరమహిళలు పాల్గొన్నారు.

# నున్న సురేష్‌కు నివాళులర్పించిన బత్తుల దంపతులు



**కోరుకొండ, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల విద్యాసంస్థల ఆదినేతల్లో ఒకరైన స్వర్గీయ నున్న సురేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో పరమపదించిన విషయం పాఠకులకు విధితమే. ఆదివారం స్వర్గీయ నున్న సురేష్ పెదకార్యం సందర్భంగా రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతులు సురేష్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.భగవంతుడు నున్న కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించాలని, నున్న కుటుంబసభ్యులు ఈ విషాదం నుంచి త్వరగా కోలుకోవాలని బత్తుల దంపతులు అన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల దంపతులు, నున్న తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరంగపట్నంలో ఘనంగా బంగారు వరలక్ష్మి కానుక లక్కీడ్రా-4

## -155 మంది మహిళలకు బంగారు రూపులు, పట్టుచీరలు





**కోరుకొండ, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గౌరీ సెంటర్ లో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు,భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన బంగారు వరలక్ష్మి కానుక సీజన్-4 లక్కీడ్రాలో బంగారు వరలక్ష్మి రూపులు పట్టుచీరలు పంపిణీ చేశారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గ్రామస్తులు కంబాల శ్రీనివాసరావు దంపతులకు పూలమాల వేసి సాల్వతో ఘనంగా సత్కరించారు. వరలక్ష్మి అమ్మవారికి కంబాల దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి,జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా కంబాల మాట్లాడుతూ మహిళా మూర్తుల్లో హైందవ చైతన్యం పెంపొందించడం, సనాతన ధర్మ విలువలను బలోపేతం చేయడం కోసం శ్రావణమాసంలో వరలక్ష్మి వ్రతాన్ని జరుపుకోవాలనే సంకల్పంతోనే బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమాన్ని 2023సంవత్సరంలో శ్రీకారం చుట్టామన్నారు.మన దేశం విశ్వగురువని, మన సంస్కృతి సాంప్రదాయాలను, ప్రతి ఒక్కరు పాటించాలన్నారు.

రంపచోడవరం, రాజానగరం,జగ్గంపేట మూడు నియోజక వర్గంలో విద్య, వైద్య ఆర్ధికపరంగా సొంత నిధులతో 18రకాల సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.లక్కీడ్రాలో శ్రీరంగపట్నం,కోటి, కోటి కేశవరం, గరగలంపాలెం, రాఘవపురం తదితర గ్రామాల నుండి గెలిపోందిన 155 మంది మహిళలకు బంగారు రూపులు, పట్టుచీరలు కంబాల దంపతులు ఉచితంగా పంపిణీ చేసారు.లక్కీడ్రాలో గెలిపోందని 2వేల మంది మహిళలకు పట్టుచీరలు,పసుపు కుంకుమ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వరి పంటకు ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ ఫామ్ సాగు : రిని

## ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు



**కోరుకొండ, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగు చేసి అధికలాభాలు పొందాలని హార్టికల్చర్ అధికారిణి పి రిని అన్నారు. ఆదివారం కోటి కేశవరం గ్రామంలో ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ములగాడ గాంధీ వరి పొలంలో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకరం చుట్టినట్లు రిని తెలిపారు. ఈ సందర్భంగా రిని మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగుకు కోటి కేశవరం గ్రామం చాలా అనువుగా ఉందని, వరితో పోల్చితే ఆయిల్ ఫామ్ అన్ని వాతావరణ మార్పులకు తట్టుకుంటూ, తక్కువ నీరు తక్కువ పెట్టుబడితో రైతులకు అధిక ఆదాయం లభిస్తుందన్నారు.వరికి ప్రత్యామ్నాయంగా పామ్ ఆయిల్ పంట వేసుకొని ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీతో అధిక ఆదాయం సాధించాలని రిని పిలుపునిచ్చారు. రైతులు ఆయిల్ ఫామ్ సాగుకు ముందుకు వస్తున్నారని, ఉద్యానశాఖ సిబ్బంది, పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ సిబ్బంది రైతులకు ఆయిల్ ఫామ్ పై అవగాహన కల్పిస్తున్నారన్నారు. 2026-27 సంవత్సరంలో కోటి కేశవరంలో 27.5 ఎకరాలు,మండల పరిధిలో 75 ఎకరాలలో పామాయిల్ పంటను వరికి ప్రత్యామ్నాయంగా వేశారని ఆమె తెలిపారు. అదేవిధంగా డ్రిప్ ద్వారా తోటకు ఎరువులు ఇవ్వడం వల్ల ఉపయోగాలు, అంతరపంటల సాగు వంటి అంశాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ మూడే సింధుకామేష్, మూలగాడ కృష్ణ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ డీఎస్ శ్రీనివాస్,పామ్ ఆయిల్ కంపెనీ సిబ్బంది వి దుర్గాప్రసాద్, ఎల్ వివి నవీన్, పామ్ఆయిల్ రైతులు తదితరులు పాల్గున్నారు.

# సీతానగరంలో 10,11, తేదీల్లో బంగారు వరలక్ష్మి కానుక -4 లక్కీడ్రా కార్యక్రమం : కంబాల

**సీతానగరం, కోరుకొండ, ఆగస్టు 09, విశ్వం వాయిస్ న్యూస్ :** విశ్వం వాయిస్ న్యూస్: బంగారు వరలక్ష్మి కానుక-4 లక్కీ డ్రా కార్యక్రమం ఈ నెల 10, 11 వ తేదీల్లో ఉదయం 11:00 గంటల నుంచి సీతానగరం జీ.వి.కే ఫంక్షన్ హల్ లో నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా భక్తుల్లో హైందవ చైతన్యం తీసుకురావాలనే సంకల్పంతో గత మూడు సంవత్సరాల నుంచి బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమం నిర్వహిస్తున్నా మని తెలిపారు. ఈ ఏడాది కూడా బంగారు వరలక్ష్మి కనుక -4 శ్రీకారం చుట్టా మన్నారు. ఈ నెల 10వ తేదీన సీతానగరం టౌన్ కి సంబంధించి లక్కీడ్రా, నిర్వ హిస్తామని, 11వ తేదీన సీతానగరం మండలం విలేజ్ లకు సంబంధించి లక్కీడ్రా నిర్వహించి, గెలుపొందిన మహిళామూర్తులకు వరలక్ష్మి రూపులు, పట్టుచీరలు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. 2023 సంవత్సరంలో శ్రావణమాసంలో వరలక్ష్మి వ్రతం చేసుకొనే మహిళల కోసం ఈ బంగారు వరలక్ష్మి కానుకను మహిళల ముం దుకు తీసుకువచ్చామని వెల్లడించారు. ఈ కార్యక్ర మం ఎంతో విజయవంతం కావడంతో ఈ ఏడాది కూ డా ప్రారంభిస్తున్నామన్నా రు. ఈ అవకాశాన్ని మహి ళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
✦ సువర్ణావకాశం ✦
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

### టాక్సిక్ ట్రైలర్ వేడుకలో

# రుక్మిణి వసంత్ స్పెషల్ అట్రాక్షన్

### చెప్పుల ధర తెలిస్తే నోరెళ్లబెట్టాల్సిందే..




సప్త సాగరాలు దాచే సినిమాతో దక్షిణాదిలో మరింత పాపులర్ అయిన హీరోయిన్ రుక్మిణి వసంత్. మొదటి సినిమాతోనే నటిగా ప్రశంసలు అందుకున్న ఈ అమ్మడు.. ఆ తర్వాత కాంతార 1 చిత్రంతో పాన్ ఇండియా లెవల్లో క్రేజ్ సొంతం చేసుకుంది. ఇప్పుడు మోస్ట్ అవైటెడ్ మూవీ టాక్సిక్ సినిమాలో కీలకపాత్ర పోషిస్తుంది. రాకింగ్ స్టార్ యశ్ నటిస్తోన్న లేటెస్ట్ మూవీ టాక్సిక్. ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, పోస్టర్స్ మరింత హైప్ క్రియేట్ చేశాయి. ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేయనున్నారు. ఈ క్రమంలోనే ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా తాజాగా టాక్సిక్ ట్రైలర్ రిలీజ్ చేసింది చిత్రయూనిట్. ఇందుకు సంబంధించిన కార్యక్రమానికి హీరోయిన్లు నయనతార, రుక్మిణి వసంత్, కియారా అద్వానీ, తారా సుతారియా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నటి రుక్మిణి వసంత చాలా ముద్దుగా కనిపించారు. క్రీమ్ కలర్ ఫ్రాక్ ధరించి సింపుల్ లుక్ లో పాలరాతి శిల్పంలా కనిపించింది. ముఖ్యంగా తన అందమైన రూపంతో ఈ వేడుకలో అందరి దృష్టిని ఆకర్షించింది. ఇదిలా ఉంటే.. రుక్మిణి వసంత్ ధరించిన మాంట్‌సెండ్ లేస్ మిడి డ్రెస్ ధర సుమారు రూ. 54,269 ఉంటుందని సమాచారం. అలాగే తన డ్రెస్ కు మ్యాచింగ్ గా సరిపోయే హిల్స్ ధరించింది. వాటి ధర సుమారు రూ. 4350. ఇక రుక్మిణి సింపుల్ చెవి రింగులు, చైన్, సింపుల్ మేకప్, హెయిర్ స్టైల్ తో ఈ వేడుకలో మరింత హైలెట్ అయ్యారు. ఆమెకు సంబంధించిన ఫోటోస్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. టాక్సిక్ ట్రైలర్ విడుదల కావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. యశ్ విభిన్న కోణాలు, తండ్రీకొడుకుల ప్రతీకార కథ, బోల్డ్ మహిళా పాత్రలు, హై-వోల్టేజ్ ఫైటింగ్ సన్నివేశాలు, గీతూ మోహన్‌దాస్ ప్రత్యేకమైన మేకింగ్ 'టాక్సిక్' చిత్రాన్ని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రంగా మార్చాయి. ఈ సినిమాతో యశ్ మరోసారి బాక్సాఫీస్ విధ్వంసం సృష్టించనున్నట్లు తెలుస్తోంది.

### ఈ ముగ్గురూ సినిమా స్టార్స్ మహేష్ బాబు

# క్లాస్ మేట్స్ అని తెలుసా?



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టిన రోజు (ఆగస్టు 09) సందర్భంగా అతనికి సంబంధించిన కొన్ని వ్యక్తిగత విషయాలు నెట్టింట బాగా వైరలవుతున్నాయి. ముఖ్యంగా ప్రస్తుతం సినిమా రంగంలో స్టార్స్ గా కొనసాగుతోన్న ఓ ముగ్గురు ప్రముఖులు మహేష్ బాబుకు క్లాస్ మేట్స్ అని తెలిసింది. ఇవాళ (ఆగస్టు 09)టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టిన రోజు. దీంతో అతని కుటుంబ సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు ఈ హ్యాండ్సమ్ హీరోకు బర్త్ డే విషెస్ చెబుతున్నారు. ఇక మహేష్ పుట్టిన రోజు సందర్భంగా అతని అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అన్నదానం, రక్తదానం వంటి మంచి కార్యక్రమాలు నిర్వహించారు. ఇక సోషల్ మీడియాలోనూ మహేష్ బాబు పేరు మార్మోగుతుంది. సూపర్ స్టార్ ఫొటోలు, వీడియోలను షేర్ చేస్తూ ఫ్యాన్స్ హంగామా చేస్తున్నారు. ఇదే క్రమంలో మహేష్ కు సంబంధించి ఒక ఆసక్తికర విషయం ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. అదేంటంటే.. ప్రస్తుతం దక్షిణాదిలో స్టార్స్ గా వెలుగొందుతోన్న ముగ్గురు ప్రముఖులు మహేష్ బాబుకు క్లాస్ మేట్స్ అట. వీరందరూ కలిసి ఒకే స్కూల్ లో కలిసి చదువుకున్నారట. హైదరాబాద్ కు రాకముందు అప్పట్లో తెలుగు సినిమా పరిశ్రమ మద్రాసులో ఉండేది. తెలుగు సినిమా నటులు కూడా అక్కడే ఉండేవారు. టాలీవుడ్, కోలీవుడ్ నటుల మధ్య మంచి సంబంధాలు ఉండేవి. ఇదే క్రమంలో రెండు పరిశ్రమలకు చెందిన నటీనటుల పిల్లలు కూడా కలిసి చదువుకునే వారు. ఇక మహేష్ బాబు కూడా దాదాపు 25 సంవత్సరాల పాటు చెన్నైలో పెరిగారు. అక్కడి సెయింట్ పీటర్స్, లయోలా కాలేజీలో విద్యాభ్యాసం పూర్తి చేశాడీ సూపర్ స్టార్. ఇదే క్రమంలో కోలీవుడ్ స్టార్ హీరోలు సూర్య, కార్తీ, అలాగే ప్రముఖ సంగీత దర్శకుడు యువన్ శంకర్ రాజా ఆయనకు స్కూల్ మేట్స్ గా ఉన్నారట. వీరిందరూ కలిసి చదువుకున్నారట. ఈ విషయాన్ని సూర్య, కార్తీ కూడా పలు సందర్భాల్లో పంచుకున్నారు. ఒక ఇంటర్వ్యూలో హీరో సూర్య మాట్లాడుతూ..' స్కూల్ లో మహేష్, తాను మంచి ఫ్రెండ్స్ గా ఉండే వాళ్లమని చెప్పారు. క్లాసులో బెంచీలు ఎక్కి దూకడంతో పాటు బాగా అల్లరి చేసే వాళ్లమన్నారు. మహేష్ ఎప్పుడు చెన్నైకి వచ్చినా, చిన్న నాటి స్నేహితులను కలిసి సరదాగా గడుపుతారని సూర్య చెప్పుకొచ్చారు. మహేష్ బాబు బర్త్ డే నేపథ్యంలో మరోసారి ఈ విషయం వైరల్‌గా మారింది. ఇక సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో వారణాసి సినిమా చేస్తున్నాడు మహేష్. యాక్షన్ అడ్వెంచెరస్ థ్రిల్లర్ గా తెరకెక్కుతోన్న ఈ సినిమాలో గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే మలయాళం నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ గా చేస్తున్నారు.

క్రీడా వాయిస్

# ఆఖరి ఓవర్‌లో సిరాజ్ సిక్సర్ల విధ్వంసం..

### వార్మప్ మ్యాచ్‌లో టీమిండియా థ్రిల్లింగ్ విక్టరీ



శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ముందు జరిగిన వార్మప్ మ్యాచ్‌లో టీమిండియా థ్రిల్లింగ్ విజయం సాధించింది. 207 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చివరి ఓవర్‌లో 16 పరుగులు అవసరమైన వేళ మహమ్మద్ సిరాజ్ వరుసగా మూడు సిక్సర్లు బాది భారత్‌కు అద్భుత విజయాన్ని అందించాడు. శ్రీలంకతో జరగబోయే ప్రతిష్టాత్మక టెస్టు సిరీస్‌కు ముందు భారత జట్టుకు ఏకైక ప్రాక్టీస్ మ్యాచ్‌లో అద్భుతమైన విజయం లభించింది. కొలంబోలోని ఎన్‌సీసీ మైదానంలో జరిగిన ఈ మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఫలితం కంటే కూడా అక్కడ వాతావరణానికి అలవాటు పడేందుకు టీమిండియా ఆటగాళ్లు దీనిని ఒక మంచి అవకాశంగా ఉపయోగించుకున్నారు. చివరి రోజున లంక జట్టు విసిరిన 207 పరుగుల లక్ష్యాన్ని భారత జట్టు 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆఖరి ఓవర్‌లో విజయానికి 16 పరుగులు అవసరమైన సమయంలో భారత పేసర్ మహమ్మద్ సిరాజ్ ఊహించని రీతిలో వరుసగా మూడు సిక్సర్లు బాది జట్టుకు థ్రిల్లింగ్ విజయాన్ని అందించాడు.

**రెండో ఇన్నింగ్స్‌లో చెలరేగిన శ్రీలంక బ్యాటర్లు**

మ్యాచ్ చివరి రోజైన ఆదివారం రోజున భారత జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌ను 357 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. దీంతో శ్రీలంక బోర్డు ఎలెవన్ జట్టుకు 6 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో వేగంగా పరుగులు సాధించిన శ్రీలంక-11 జట్టు, 200 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి టీమిండియా ముందు 207 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. లంక ఓపెనర్ నిషాన్ ఫెర్నాండో తొలి ఇన్నింగ్స్‌లాగే రెండో ఇన్నింగ్స్‌లోనూ అర్ధశతకంతో రాణించాడు. భారత బౌలర్లలో గుర్‌నూర్ బ్రార్, రవీంద్ర జడేజాలు చెరో రెండు వికెట్లు తీసి ప్రభావం చూపారు.

**గిల్ - జైస్వాల్ సెంచరీ భాగస్వామ్యం**

207 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఈసారి ఓపెనర్లుగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. గాయం కారణంగా తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయని గిల్, తొలి ఇన్నింగ్స్‌లో సున్నా పరుగులకే అవుటైన జైస్వాల్ ఈసారి అద్భుతమైన ఆటతీరుతో సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. జైస్వాల్ హాఫ్ సెంచరీ సాధించిన తర్వాత రిటైర్డ్ అవుట్‌గా వెళ్లగా, రిషబ్ పంత్ స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కొంటూ క్రీజులో ఎక్కువ సమయం గడిపాడు. ధ్రువ్ జురెల్ నిరాశపరిచినా, రవీంద్ర జడేజా, మానవ్ సుతార్ కొద్దిసేపు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసి వైదొలిగారు.

**సిరాజ్ హ్యాట్రిక్ సిక్సర్ల వినాశనం**

మ్యాచ్ ముగిసే చివరి నిమిషాల్లో సారాంశ్ జైన్, గుర్‌నూర్ బ్రార్‌లతో పాటు మహమ్మద్ సిరాజ్ బ్యాటింగ్ చేయడానికి మైదానంలోకి వచ్చాడు. ఆఖరి ఓవర్‌లో టీమిండియా గెలుపునకు 16 పరుగులు కావాల్సి ఉండగా, లంక స్పిన్నర్ నువంత వేసిన బౌలింగ్‌పై సిరాజ్ పంజా విసిరాడు. వరుసగా 3 సిక్సర్లు (హ్యాట్రిక్ సిక్సర్లు) బాది మ్యాచ్‌ను ముగించాడు. కేవలం 5 బంతుల వ్యవధిలో 4 సిక్సర్లు కొట్టిన సిరాజ్ మొత్తం 15 బంతుల్లో 32 పరుగులతో నాటౌట్‌గా నిలిచి బ్యాట్‌తో కూడా తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు.

# యశస్వి చేసిన పనికి 4 మ్యాచ్‌ల బ్యాన్..

### చివరి నిమిషంలో రహానే ఏం చేశాడంటే?



యశస్వి జైస్వాల్‌పై 2022 దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో క్రమశిక్షణా చర్యలు తీసుకునే పరిస్థితి ఏర్పడిందని అజింక్య రహానే వెల్లడించారు. నాలుగు మ్యాచ్‌ల నిషేధం విధించే అవకాశం ఉన్న సమయంలో, కెప్టెన్‌గా తాను తీసుకున్న కఠిన నిర్ణయం వల్ల యశస్వి బ్యాన్ నుంచి తప్పించుకున్నాడని తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత భారత మాజీ క్రికెటర్ అజింక్య రహానే ఒక పాత వివాదంపై సంచలన విషయాలను వెల్లడించారు. 2022 దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో యశస్వి జైస్వాల్ క్రమశిక్షణా రాహిత్యం కారణంగా అతనిపై ఏకంగా 4 మ్యాచ్‌ల నిషేధం పడే ప్రమాదం ఉండిందని, తాను తీసుకున్న నిర్ణయం వల్లే అతని కెరీర్ నిలిచిందని రహానే తెలిపారు. వెస్ట్ జోన్, సౌత్ జోన్ జట్ల మధ్య జరిగిన ఆ మ్యాచ్‌లో వెస్ట్ జోన్ కెప్టెన్‌గా ఉన్న రహానే, మైదానంలో ప్రత్యర్థి బ్యాటర్‌తో తీవ్రంగా వాగ్వాదానికి దిగిన యశస్వి జైస్వాల్‌ను మైదానం నుంచి బయటకు పంపించి వార్తల్లో నిలిచారు.

**హద్దులు దాటిన స్లెడ్జింగ్ - హెచ్చరించినా వినని యశస్వి**

2022 దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో సౌత్ జోన్ బ్యాటర్ రవి తేజపై యశస్వి జైస్వాల్ వరుసగా స్లెడ్జింగ్‌కు దిగాడు. మైదానంలో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో రవి తేజను అనవసరంగా రెచ్చగొట్టడం ప్రారంభించాడు. ఈ క్రమంలో ఫీల్డ్ అంపైర్లు యశస్విని అనేకసార్లు హెచ్చరించినప్పటికీ అతను ఏమాత్రం వినకుండా తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయాడు. గొడవ పెద్దదిగా మారి ఆట సమయం వృధా అవుతుండటంతో, పరిస్థితి చేయి దాటిపోకుండా ఉండేందుకు వెస్ట్ జోన్ కెప్టెన్ అజింక్య రహానే జోక్యం చేసుకున్నారు. జైస్వాల్ ప్రవర్తన నచ్చకపోవడంతో అతడిని మైదానం బయటకు వెళ్లిపోవాల్సిందిగా రహానే ఆదేశించారు.

**4 మ్యాచ్‌ల బ్యాన్ లెటర్ చింపేసిన మ్యాచ్ రెఫరీ**

ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రహానే ఆ సంఘటన వెనుక ఉన్న అసలు నిజాలను వెల్లడించారు. "ఆ సమయంలో మైదానం నుంచి బయటకు వెళ్లాల్సి రావడం యశస్వికి బాధ కలిగించి ఉండవచ్చు. క్రికెట్‌లో స్లెడ్జింగ్ ఉండటం సాధారణమే, అది ఆటకు వినోదాన్ని ఇస్తుంది. కానీ ఆ రోజు హద్దులు దాటిపోయింది. ఇప్పటికే పలువురు ఆటగాళ్లు ఇలాంటి ప్రవర్తన వల్ల నిషేధానికి గురవడం నేను చూశాను. అందుకే నా జట్టు ఆటగాడిని కాపాడుకోవడం కెప్టెన్‌గా నా బాధ్యత అనుకున్నాను" అని రహానే చెప్పారు. మ్యాచ్ ముగిసిన తర్వాత రెఫరీ యశస్విపై 4 మ్యాచ్‌ల నిషేధం విధిస్తూ లెటర్ కూడా సిద్ధం చేశారని, అయితే రహానే తీసుకున్న కఠిన చర్యను చూసి మెచ్చుకుంటూ ఆ లెటర్‌ను తన ముందే చింపేశారని రహానే గుర్తుచేసుకున్నారు.

**నేడు టీమిండియా స్టార్‌గా యశస్వి**

కెప్టెన్‌గా రహానే ఆ రోజు అంత సమయస్ఫూర్తితో నిర్ణయం తీసుకోకపోయి ఉంటే, యశస్వి జైస్వాల్ తీవ్రమైన క్రమశిక్షణా చర్యలను ఎదుర్కొని ఉండేవాడు. కానీ రహానే క్రమశిక్షణకు ప్రాధాన్యతనిచ్చి సొంత జట్టు ఆటగాడినే మైదానం నుంచి బయటకు పంపి మ్యాచ్ రెఫరీకి స్పష్టమైన సందేశమిచ్చారు. దానివల్ల జైస్వాల్‌పై ఎలాంటి నిషేధం పడలేదు. ఆ తర్వాతి కాలంలో తన తప్పు తెలుసుకుని క్రమశిక్షణతో ఆడిన యశస్వి జైస్వాల్, ప్రస్తుతం టీమిండియాలో కీలకమైన ఓపెనర్‌గా మారి అద్భుతమైన రికార్డులతో దూసుకుపోతున్నాడు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com